


ESTD: 1999
25-10-2026 ఆదివారం
www.voodayam.com

# ఉదయం

వరంగల్ 28-10-2026 బుధవారం | సంపుటి : 11 | సంచిక : 313 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur

Follow us on




## బీసీ అధ్యయన కేంద్రాల్లో

# సమూల సంస్కరణలు



**హైదరాబాద్, అక్టోబర్ 27 (ఎఎంఎస్) :** వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ శాఖ ద్వారా అమలు జరుగుతున్న వివిధ పథకాల అమలులో పారదర్శకతను పెంచడంతో పాటు పనుల వేగాన్ని మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో బీసీ గురుకులాల మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు, నిరుద్యోగుల శిక్షణ, స్వయం ఉపాధి కల్పన తదితర కీలక అంశాలపై ఆయన దీర్ఘకాలిక ప్రణాళికలను సమీక్షించారు.

**విదేశీ విద్యా నిధి, ఆత్మగౌరవ భవనాలు:**

మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకం ద్వారా అర్హులైన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎలాంటి పెండింగ్ లేకుండా, పూర్తి పారదర్శకతతో నిధులు విడుదలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల సూచనల ప్రకారం 38 ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియను వీలైనంత త్వరగా ముగించాలని ఆదేశించారు.

**డిసెంబర్ 9న కుట్టు మిషన్ల పంపిణీ:**

బీసీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉద్దేశించిన 'ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల' పథకానికి అనూహ్య స్పందన లభించిందని, దాదాపు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని నిర్ణయించామని, టెండర్ల ప్రక్రియను ముగించి డిసెంబర్ 9 నాటికి యంత్రాలను అందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. రాజీవ్ యువ వికాసం పథకంలో బీసీలకు తగిన ప్రాధాన్యత లభించేలా ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

**గురుకులాలకు సొంత భవనాలు - కలెక్టర్ల పర్యవేక్షణ:**

రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో ఆర్‌సీవోల పర్యటన నివేదికలను పరిశీలించిన మంత్రి, కేవలం 26 గురుకులాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు. మిగిలిన 301 ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నందున, సొంత స్థలాలు ఉన్న 37 గురుకుల భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధుల మంజూరుపై ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. మిగతా వాటికి స్థల సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు. ప్రతి జిల్లా కలెక్టర్ నెలకు ఒక గురుకులాన్ని తప్పనిసరిగా సందర్శించి నివేదిక ఇవ్వాలని, నవంబర్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యార్థులకు వాతావరణ మార్పులు, నీటి పొదుపు, విద్యుత్ మితవ్యయంపై అవగాహన కల్పించాలని సూచించారు.

## వికసిత భారత నిర్మాణంలో

# నవీన సాంకేతికతదే కీలక పాత్ర

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (ఎఎంఎస్) :** భారతదేశం ఆవిర్భవిస్తున్న నూతన భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపూర్ణంగా స్వీకరించడంతో పాటు, సాహసోపేతమైన పరిశోధనలతో ప్రపంచ రంగానికి దిశా నిర్దేశం చేయాలని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశం కొత్త ఆలోచనా విధానంతో, సరికొత్త ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని ఆయన ఉద్ఘాటించారు. రాజధాని న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన 'ఆవిర్భవిస్తున్న శాస్త్ర, సాంకేతిక, నవోత్సాహ అంతర్జాతీయ సదస్సు 2026' నుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. నేడు, రేపు తరం కోసం, అంతర్జాతీయ మానవాళి శ్రేయస్సు కోసం నూతన సాంకేతికతను సృష్టించడం, దానికి సరైన మార్గం చూపడమే మన దేశ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ సాంకేతికతను సొంతం చేసుకుంటూ, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలలో భారత్ అగ్రగామిగా నిలవాలన్నారు.ప్రాచీన కాలంలో



సున్నా ఆవిష్కరణ, సంఖ్యా వ్యవస్థ రూపకల్పన, ఖగోళ శాస్త్ర పురోగతి నుంచి నేటి ఆధునిక రంగా వరకు భారతీయ సంస్కృతి ఎల్లప్పుడూ జ్ఞాన అన్వేషణ, పరిశోధనలపైనే ఆధారపడి ఉందన్నారు. ఆ ఘనమైన వైజ్ఞానిక వారసత్వాన్ని నేటి నవీన సాంకేతికత, ఆత్మవిశ్వాసంతో దేశం ముందుకు తీసుకెళ్తోందన్నారు. వికసిత భారత స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి అణుశక్తి అత్యంత కీలకమని, అందుకే ఫాస్ట్ బ్రీడర్ రెక్టార్ సాంకేతికతను త్వరితగతిన అభివృద్ధి చేస్తున్నామని ప్రధాని వివరించారు. తమిళనాడులోని కల్పాక్కంలో దేశీయంగా తయారు చేసిన మొదటి నమూనా ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ ఈ ఏడాది ఆగస్టులో క్లిష్టమైన దశను దాటి క్రిటికాలిటీని సాధించడం సాంకేతిక రంగంలో ఒక మైలురాయి అని కొనియాడారు.అన్ని రంగాల్లో భారత్ సాధిస్తున్న విజయాలు అపూర్వమైనవని ప్రధాని మోదీ ప్రశంసించారు. దేశీయంగా తయారైన మొదటి విడత సూక్ష్మచిప్‌లు ఇప్పటికే ప్రపంచ విపణిలోకి ఎగుమతి కావడం ప్రారంభమయ్యాయని తెలిపారు. విద్యుత్ నిల్వ ఘటాల తయారీ రంగంలోనూ మన దేశ వనరులను సమర్థవంతంగా వాడుకుంటూ స్వయంసమృద్ధి దిశగా సామర్థ్యాన్ని పెంచుకుంటున్నామని వెల్లడించారు.అంతరిక్ష రంగంలో సాధించిన ప్రగతిని ప్రస్తావిస్తూ, గతేడాది జులైలో స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ తన విక్రమ్ 1 అనే మొదటి ప్రైవేట్ కక్ష్య నౌకను విజయవంతంగా ప్రయోగించి ఉపగ్రహాలను తక్కువ ఎత్తులో ఉన్న కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు.

## ఔషధాల ధరల నియంత్రణ పిటిషన్లపై విచారణ పూర్తి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (ఎఎంఎస్) :** ఔషధాల గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ) కి, చిల్లర వ్యాపారులకు తయారీదారులు విక్రయించే ధరకు మధ్య ఉన్న అపారమైన వ్యత్యాసంపై సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. "మొత్తం యావత్ వ్యవస్థ ఔషధ తయారీదారులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఎందుకు పనిచేస్తోంది?" అని న్యాయమూర్తి విక్రమ్‌నాథ్, న్యాయమూర్తి సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నిలదీసింది. అయితే, ఔషధ రంగానికి సంబంధించిన సమగ్ర వ్యవస్థను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తెచ్చి నియంత్రించకూడదనేది ప్రభుత్వ విధానమని అత్యున్నత న్యాయస్థానానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఆర్నబ్ తుపాను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

**అమరావతి:** రాష్ట్రంపై విరుచుకుపడుతున్న 'ఆర్నబ్' తీవ్ర తుపాను ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం భారీ స్థాయిలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని, ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టాన్ని వీలైనంత వరకు నివారించడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్యకారులకు చెందిన 30 వేలకు పైగా వేట పడవలను ఇప్పటికే సురక్షితంగా సముద్రం నుండి వెనక్కి రప్పించామని, గోపాల్‌పూర్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 93 పడవలు, వాటిలోని సిబ్బంది సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. అత్యవసర వైద్య సేవల కోసం 1,316 అంబులెన్సులను సిద్ధంగా ఉంచడంతో పాటు, సుమారు 5 వేల మంది గర్భిణులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులకు తరలించినట్లు వివరించారు. విద్యుత్ సరఫరాకు విఘాతం కలిగితే తక్షణమే పునరుద్ధరించేందుకు 8,400 మంది సిబ్బందిని రంగాన దించామన్నారు. ఈ ఈదురు గాలుల దాటికి 15 వేల వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉందని అంచనా వేసి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు.వరద ముప్పు సహాయక చర్యలకు ఆధునిక యంత్రాలు:నాగావళి, వంశధార నదులకు ఉప్పెనలా వరద నీరు చేరే సూచనలు ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని చెప్పారు. వాగులు, వంకల ఉధృతిని నిరంతరం సమీక్షిస్తూ, ఒకవేళ చెరువులకు గండ్లు పడితే వెంటనే బాగుచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరద ముంపునకు గురయ్యే గ్రామాలకు నిత్యావసర ఆహారం, ఔషధాలు అందించడానికి ఆకాశమార్గంలో డ్రోన్లను ఉపయోగిస్తున్నామని, తాగునీటి ఎద్దడి రాకుండా నీటి ట్యాంకర్లు, విద్యుత్ జనరేటర్లను సిద్ధం చేశామన్నారు. తుపాను తీవ్రత వల్ల 7.16 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 16 లక్షల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతినే వీలుందని ప్రాథమికంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తీరప్రాంతాల ప్రజలు తక్షణమే సురక్షిత పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, ప్రవాహాల వైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ, రాష్ట్ర విపత్తు ఉపశమన దళాలతో పాటు భారత నౌకాదళం, తీర రక్షణ దళాలను సన్నద్ధం చేశామని, పూర్వపు 'హుద్‌హుద్' తీవ్రతతో పోలిస్తే దీని ప్రభావం కొంత తక్కువగా ఉండవచ్చని తెలిపారు.

# రూ. 30 కోట్ల అంతర్జాల మోసం!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (ఎఎంఎస్) :** దిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక విద్యార్థిని అంతర్జాలంలో దుస్తులు కొనుగోలు చేసే క్రమంలో ఎదుర్కొన్న ఒక చిన్న మోసం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన అధికారులకు ఊహించని నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఏకంగా రూ. 30 కోట్లకు పైగా సాగిన భారీ అంతర్జాల ఆర్థిక నేర నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఫాతిమా అనే యువతి దిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో దృశ్యాలు చూస్తున్న సమయంలో ఒక విక్రయ ప్రకటనలో కనిపించిన మహిళా దుస్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించింది. సదరు సంస్థకు చెందిన వాట్సాప్ ఖాతాకు పంపిన క్యూఆర్ కోడ్ ద్వారా మొదట రూ. 400 చెల్లించింది. ఆ తర్వాత పార్శిల్ రవాణా ప్రక్రియ కోసమంటూ ముష్కరులు ఆమెకు ఫోన్ చేసి రహస్య సంకేతాన్ని ఆరా తీయగా, ఆమె తన ఫోన్‌కు వచ్చిన సంకేతాన్ని తెలిపింది. ఆపై డెలివరీ రుసుము చెల్లిస్తే వెంటనే ఆ మొత్తాన్ని వెనక్కి పంపుతామని నమ్మబలికి దఫదఫాలుగా రూ. 1,150, రూ. 2,000, రూ. 2,650, రూ. 650 బదిలీ చేయించుకున్నారు. ఎంతకీ వస్తువు చేరకపోవడం, చెల్లించిన సొమ్ము తిరిగి రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన సదరు విద్యార్థిని జాతీయ అంతర్జాల నేరాల నమోదు కేంద్రంలో ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా ఉత్తర జిల్లా అంతర్జాల నేరాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు జరిపిన లోతైన దర్యాప్తులో బాధితురాలు చెల్లించిన సొమ్ము కెనరా బ్యాంకులోని ఒక ఖాతాకు చేరినట్లు ఆధారాలు లభించాయి. ఆ ఖాతాతో సంబంధం ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకోగా, అతడు అందించిన సమాచారంతో మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే 27 అంతర్జాల మోసం కేసులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నకిలీ సంస్థలు, లేని వ్యక్తుల పేర్లతో తెరిచిన 25 బ్యాంకు ఖాతాల ద్వారా వీరు ఏకంగా రూ. 30 కోట్ల అక్రమ సొమ్మును మళ్లించినట్లు నిర్ధారణ అయింది. ఈ భారీ అక్రమ లావాదేవీలపై అధికారులు మరింత విస్తృతంగా విచారణ జరుపుతున్నారు.

## భవిష్యత్ నగరంలో

# ప్రపంచ స్థాయి పెట్టుబడుల సదస్సు

**550కి పైగా ప్రముఖ సంస్థలకు ఆహ్వానాలు**



**హైదరాబాద్, అక్టోబర్ 27 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో నిర్మిస్తున్న భవిష్యత్ నగరంలో ఈ ఏడాది చివరి మాసంలో నిర్వహించనున్న 'తెలంగాణ పెట్టుబడుల అంతర్జాతీయ సదస్సు 2026' వేడుకలకు 550కి పైగా స్వదేశీ, విదేశీ దిగ్గజ సంస్థలకు ఆహ్వానాలు పంపినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ బృహత్ సదస్సు నిర్వహణకు ఏర్పరిచిన వివిధ బాధ్యతాయుత బృందాల పనితీరు, ఏర్పాట్ల పురోగతిపై మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు నవీన్ మిట్టల్, హరిచందన, గౌరవ్ ఉప్పల్, సర్ఫరాజ్ అహ్మద్, కృష్ణ ఆదిత్య, అనుదీప్, శశాంక, కృష్ణ భాస్కర్, వల్లూరి క్రాంతి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దిల్లీలో పూర్వరంగ ప్రదర్శన:**

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడం, పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి పోయడం మరియు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే ధ్యేయంగా ఈ సదస్సును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. దీనికి ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం కల్పించేందుకు ఈ నెల 29న దేశ రాజధాని న్యూఢిల్లీలో పూర్వరంగ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొంటారని, వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార సామ్రాజ్యాల అధినేతలకు ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు.

**విస్తృత ప్రచారం, 1500 సంస్థల ప్రాతినిధ్యం:**

ఇప్పటికే చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఈ ప్రచార యాత్రలను పూర్తి చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో జరగబోయే ప్రధాన సదస్సుకు మొత్తంగా 1,500 కంటే ఎక్కువ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు విచ్చేస్తున్నారని తెలిపారు.

**రక్షణ, ఆకాశయాన రంగానికి ప్రాధాన్యత:** సదస్సులో భాగంగా ఏర్పాటు చేసే రక్షణ ప్రదర్శనలో పాల్గొనేందుకు అంతర్జాతీయంగా ఆకాశయాన, రక్షణ రంగాలకు చెందిన సుమారు 100 ప్రముఖ సంస్థలను ఆహ్వానిస్తున్నామని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ ప్రదర్శన ద్వారా స్థానిక సంస్థలకు కూడా అంతర్జాతీయ అవకాశాలు లభిస్తాయన్నారు.

## ఇంతే కదా...!











# నిర్దేశిత గడువులో భూ రీసర్వే పనులు పూర్తి చేయాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ

**మహబూబ్‌నగర్**

మహబూబ్‌నగర్ పట్టణ మండల పరిధిలోని సర్వే నంబర్లు 927, 929, 930, 946లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణ మండల తహసీల్దార్ ఘన్సీ రామ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రీసర్వే పనుల పురోగతిని సమీక్షించి, క్షేత్రస్థాయిలో అనుసరిస్తున్న విధానాలను, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వే నంబర్ 946లో ప్రభుత్వ భూముల రీసర్వే పనులు, 927, 929, 930 సర్వే నంబర్లలో ఆర్ఐ బృందం ఆధ్వర్యంలో ఆబాది సర్వే, గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులు చేపడుతున్నట్లు డీటీ బృందం, మండల సర్వేయర్ ఆమెకు వివరించారు.రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

# చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరిన మోతె గ్రామ నేతలు

- త్వరలోనే కాంగ్రెస్ లోకి మరో ముగ్గురు సర్పంచ్‌లు చేరబోతున్నారంటూ.?
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండా శంకర్ సంచలన వ్యాఖ్యలు?

**అక్బర్ పేట భూంపల్లి అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి )**

అక్బర్‌పేట భూంపల్లి మండలం మోతె గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి నివాసంలో, అక్బర్‌పేట భూంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండా శంకర్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరికైనారు. పార్టీలో చేరిన వారికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా అక్బర్ పేట భూంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండా శంకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, దుబ్బాక నియోజకవర్గంలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా కాంగ్రెస్‌లోకి వస్తున్నారని తెలిపారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.పార్టీలో చేరిన వారిలో



మోతె గ్రామానికి చెందిన 3వ వార్డు సభ్యురాలు బైండ్ల రాణి రామస్వామి, 9వ వార్డు సభ్యుడు మాదాసు నగేష్, గుంటి అఖిల్ కుమార్‌తో పాటు పలువురు యువకులు, మహిళలు ఉన్నారు. తామంతా ప్రజా పాలన సంక్షేమ పథకాలకు మద్దతుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని వారు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మడ్డి సత్య గౌడ్, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి, నాయకులు మల్లేశం, వెంకట్, యూసుఫ్, కవిత, సరిత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండా శంకర్ సంచలన వ్యాఖ్యలు?

దుబ్బాక రాజకీయాల్లో కొత్త కలకలం..త్వరలో ఆ ముగ్గురు సర్పంచ్‌లు ఎవరు?

దుబ్బాక నియోజకవర్గ రాజకీయాల్లో ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే నియోజకవర్గానికి చెందిన మరో ముగ్గురు కీలక సర్పంచ్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్నారని ఆయన బాంబు పేల్చారు. ఆ ముగ్గురు సర్పంచ్‌లు ఎవరు? వారు ఏ గ్రామానికి చెందినవారు? అనే వివరాలను మాత్రం ఆయన ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచారు. దీంతో ఈ ముగ్గురు నేతల చేరిక ఎవరు అనేది ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ,ఆసక్తికర చర్చ మొదలైంది.



## సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం

# కదులుతున్న పల్లెలు

- రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా 23 వ రోజు ఎక్లాస్ ఖాన్ పేట గ్రామస్థులు..
- డంపింగ్ యార్డు రద్దు కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధం..
- వై.హరి శేఖర్ యాదవ్, సర్పంచ్,

**ఎక్లాస్‌ఖాన్ పేట/సిద్దాపూర్:**

సిద్దాపూర్ డంపింగ్ యార్డు జీవో 641 రద్దు కోసం జేఏసి ఆధ్వర్యంలో 23 రోజులుగా జరుగుతున్న నిరవధిక నిరాహార దీక్షలకు పల్లెలు కదులుతున్నాయి. 23 వ రోజు ఎక్లాస్ ఖాన్ పేట గ్రామస్థులు సర్పంచ్ హరి శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు తరలి వచ్చి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్లాస్ ఖాన్ పేట సర్పంచ్ వై.హరి శేఖర్ యాదవ్ మాట్లాడుతూ...సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని, జీవో రద్దు అయ్యేవరకు ఉద్యమానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. జరిగే ఉద్యమంలో ప్రజలందరూ కుల మతాలు , పార్టీలకి అతీతంగా ఎవరు ఎన్ని చెప్పినా జీవో రద్దు కొరకు ఐక్యంగా పోరాడాలి అని కోరారు. ఈ ఉద్యమం మరింత ఉధృతం గా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చెవ్వులు లేని, మనసు లేని గుడ్డి ప్రభుత్వానికి జ్ఞానోదయం అయ్యి జీవో రద్దు అయ్యే వరకు మనం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) చైర్మన్ రాంబల్ నాయక్, కో చైర్మన్ లు శ్రీనివాస్ రెడ్డి, బాలయ్య, కో కన్వీనర్ మహేష్, సిద్దాపూర్ గ్రామ జేఏసి అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీధరా చారి, నాయకులు నరేందర్ రెడ్డి, మహేష్ , మరియు ఎక్లాస్ ఖాన్ పేట నాయకులు వై సురేష్ యాదవ్, దండే దశరథ్ యాదవ్, దండే రమేష్ యాదవ్, కుమ్మరి వెంకటేష్, కుమ్మరి శ్రీను, బ్రహ్మాచారి,, దినేష్ నాయక్, శంకర్ నాయక్, బాలు నాయక్, రాము నాయక్, బైక్ ని శ్రీశైలం యాదవ్, పండు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టం తెలుసుకుంటేనే బాల్యం సురక్షితం

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే అవినాష్

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 27(వుదయం ప్రతినిధి )**

చట్టం తెలుసుకుంటేనే బాల్యం సురక్షితం అని నారాయణపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే అవినాష్ అన్నారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఏ) ఆధ్వర్యంలో చేపట్టిన సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ లో భాగంగా రెండవ రోజు కార్యక్రమం కానూన్ జానో, బచ్‌పన్ బచావో చట్టం తెలుసుకో, బాల్యాన్ని కాపాడు అనే అంశంపై మంగళవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం యాదగిరి రోడ్డు, నారాయణపేటలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి నారాయణపేట అవినాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేను మన సమాజ భవిష్యత్తు యొక్క మూలాలను స్పృశించే ఒక అంశంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాన్ని తెలుసుకోండి, బాల్యాన్ని రక్షించండి బాల్యం అనేది అమాయకత్వం, నవ్వు, ఆటలు, అభ్యాసానికి సమయం అన్నారు. అయినప్పటికీ తరగతి గదులలో హాయిగా కూర్చుని ఉండగా, మన దేశవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలు చీకటి కర్మాగారాలలో, ఇటుక బట్టీలలో, గృహ బానిసత్వంలో చిక్కుకుపోయారన్నారు. వారి పుస్తకాల స్థానంలో బరువైన పనిముట్లు వచ్చాయి, అకాల ప్రసవ భారం వారి కలలను చిదిమేసింది అన్నారు. బాలలకు సంబంధించిన చట్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, చట్టం తెలిస్తేనే



తమను తాము కాపాడుకోగలరని విద్యార్థినులకు తెలిపారు.చైల్డ్ డిపార్ట్మెంట్ సిబ్బంది మాట్లాడుతూ ముఖ్యంగా బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, బాల కార్మిక నిషేధ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం, జువైనల్ జస్టిస్ చట్టం గురించి వివరించారు. 18 ఏళ్ల లోపు వివాహం చేయడం నేరమని, 14 ఏళ్ల లోపు పిల్లలతో పని చేయించడం శిక్షార్హమని తెలిపారు.ఏదైనా అన్యాయం జరిగితే భయపడకుండా 1098 చైల్డ్ లైన్, 100 పోలీస్, 15100 డి ఎల్ ఎస్ ఏ టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. అత్యవసర సేవలకు డయల్ చేయడం ద్వారా బాల కార్మికత, అక్రమ రవాణా లేదా దుర్వినియోగం గురించి తక్షణమే నివేదించవచ్చు అన్నారు.లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ డి ఎల్ ఎస్ ఏ సేవల ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, బాలికలకు ప్రత్యేక రక్షణ, ఉచిత న్యాయవాది, పరిహారం, కౌన్సెలింగ్ వంటి సేవల గురించి వివరించారు.అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ కరాటే పోటీలలో బంగారు పతకాలు సాధించిన మొదటి సంవత్సరం ఎం అశ్విని ,10 వ తరగతి ,క్లాస్ బి రక్షిత టీఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ బాలికల పాఠశాల విద్యార్థినులను ప్రిన్సిపాల్ హమీని పి ఈ టి జి. యాదమ్మ జడ్జికి పరిచయం చేయగా, గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినుల మెడలో జడ్జి స్వయంగా బంగారు పతకాలు వేసి అభినందించారు.ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ముందుండాలని, క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో తోడ్పడతాయని, ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థినీలు తెలుసుకున్న చట్టాలను ఇంటికి వెళ్లి మీ తల్లిదండ్రులకు, తోటి స్నేహితులకు తప్పక పాల్గొన్నారు.బాల్య వివాహం జరుగుతున్నట్టు తెలిసినా, బాల కార్మికులు కనిపించినా వెంటనే డి ఎల్ ఎస్ ఏ కి తెలపాలని జడ్జి సూచించారు.విద్యార్థినులు చట్టం తెలుసుకుంటాం బాల్యాన్ని కాపాడుకుంటాం అని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ బాలాజీ, చైల్డ్ డిపార్ట్మెంట్ కరిష్మా, నర్సిములు, భరోసా సెంటర్ ప్రమీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, డి ఎల్ ఎస్ ఏ ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగుపై

# రైతులకు అవగాహన

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 27 (వుదయం):**

దుబ్బాక మండలం తిమ్మాపూర్ రైతు వేదికలో తిమ్మాపూర్, ఆసన్‌మీరాపూర్, అప్పనపల్లి గ్రామాల రైతులకు పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, జనుము పంటల సాగుపై శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా దుబ్బాక వ్యవసాయ సహాయ సంచాలకుడు కాంపాటి మల్లయ్య మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, వర్మీ కంపోస్టు, పశువుల ఎరువులను ఉపయోగించడం ద్వారా భూసారం కాపాడుకోవచ్చన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా పొద్దుతిరుగుడు, మొక్కజొ



న్న, జనుము, కూరగాయల పంటలు సాగు చేయాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీ సదుపాయం ఉందని తెలిపారు.తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డి. రమాదేవి మాట్లాడుతూ.. వరి పంట తర్వాత పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సిద్దిపేట సమన్వయకర్త డాక్టర్ పల్లవి మాట్లాడుతూ.. ఒక ఎకరం వరికి అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల మొక్కజొన్న, ఐదు ఎకరాల పొద్దుతిరుగుడు, ఎనిమిది ఎకరాల జనుము పంటలను సాగు చేయవచ్చని వివరించారు. తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ బైబ్యాక్ ఒప్పందం ద్వారా రైతులకు జనుము విత్తనాలు అందించి, పంట దిగుబడి వచ్చిన తర్వాత క్వింటాలుకు రూ.13,300 చొప్పున కొనుగోలు చేస్తోందన్నారు. తక్కువ నీటితో సాగయ్యే జనుము పంటలో ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, అప్పనపల్లి సర్పంచ్ రామ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, తిమ్మాపూర్ ఉపసర్పంచ్ విజయ్, ఏఈవో రేణుక, ఎఫ్‌పీవో డైరెక్టర్ నారాయణ, సీఈవో భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు..

# మాజీ సర్పంచ్ ఆర్థిక సాయం



**పెద్దలోడి :**

పెద్దలోడి గ్రామానికి చెందిన పేద కుటుంబ విద్యార్థిని మన్నె లహరికకు ఎంబీబీఎస్ సీటు లభించడంతో ఆమె చదువుకు చేయూతగా తక్కడపల్లి మాజీ సర్పంచ్ నజీర్ రూ.11,000 ఆర్థిక సాయం అందించారు.వినోద్ రావు, సావిత్రి దంపతుల కుమార్తె మన్నె లహరిక వికారాబాద్‌లోని మహావీర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివే అవకాశం దక్కించుకుంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వైద్య విద్యలో సీటు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నజీర్ విద్యార్థిని చదువుకు ప్రోత్సాహంగా రూ.11,000 అందజేశారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రేమానంద్, సుధాకర్, రాజు, విద్యార్థిని తండ్రి వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు. లహరిక భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

# బాలల రక్షణ, హక్కులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు

- జిల్లాలోని పలు పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్చన్ అభియాన్' కార్యక్రమాలు

**మహబూబ్‌నగర్**

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారు మరియు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి N ప్రేమలత గారి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA), మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో "సురక్షిత్ బచ్పన్ అభియాన్ - పోక్సో చట్టం, 2012పై పాన్ ఇండియా పాఠశాల అవగాహన కార్యక్రమం" మొదటి దశలో భాగంగా 27 అక్టోబర్ 2026న మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

1. శ్రీ చైతన్య హై స్కూల్, మహబూబ్‌నగర్: ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీ వి. ఈశ్వరయ్య గారు, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ జి. అనిరుధ్ నటరాజ్ గౌడ్ గారు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC) చైర్మన్ శ్రీ నయీమ్ గారు, జువైనల్ జస్టిస్ బోర్డు (JJB) సభ్యురాలు శ్రీమతి గ్రేస్ గారు, లీగల్ ఎయిడ్ ప్యానెల్ అడ్వకేట్ శ్రీ తగిలి కృష్ణ గారు పాల్గొన్నారు.

2. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టీ.డి. గుట్ట, మహబూబ్‌నగర్: ఈ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ LADCS శ్రీ రవీందర్ నాయక్ గారు, డిప్యూటీ చీఫ్ LADCS శ్రీ యోగేశ్వర్ గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ మణి రామ్ రాథోడ్ గారు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

3. అపెక్స్ సెంట్రల్ స్కూల్, మహబూబ్‌నగర్: ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ పర్వేజ్ గారు, LADCS అసిస్టెంట్ శ్రీ మల్లారెడ్డి గారు పాల్గొన్నారు.

4. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (KGBV), బాలానగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS), బాలానగర్

5. కేజీబీవీ నవాబుపేట మొబైల్ కోర్ట్ జడ్జి గారు మునవర్ గారు పాల్గొన్నారు.

6. Galaxy హై స్కూల్ మహబూబ్నగర్ II addl JCJ రవి శంకర్ గారు పాల్గొన్నారు.7. అక్షర హై స్కూల్ జడ్చెర్ల లో Addl JCJ జడ్చర్ల ముదసిర్ గారు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో న్యాయాధికారి శ్రీమతి డి. ఇందిర గారు, పాఠశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

**బాలల భద్రతే సమాజ బాధ్యత**

ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు పోక్సో చట్టం, 2012లోని ముఖ్యమైన నిబంధనలు, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత,



బాలలపై లైంగిక వేధింపుల నివారణ, బాలల రక్షణ వ్యవస్థలపై అవగాహన కల్పించారు.

బాలలపై జరిగే లైంగిక నేరాలను అరికట్టడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు మరియు సంబంధిత అధికారుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను గుర్తించి, భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

బాలలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం, వారిపై జరిగే నేరాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ కార్యక్రమాల ద్వారా తెలియజేశారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో బాలల రక్షణ, న్యాయ హక్కులు మరియు పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించడానికి దోహదపడేలా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

## సికింద్రాపూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి

# హుండీ ఆదాయం లెక్కింపు

- ఐదు నెలల హుండీ ఆదాయం రూ.1,69,382

**వుదయం న్యూస్ శివ్వంపేట, అక్టోబర్ 27 .....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని సికింద్రాపూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు, పోలీస్ శాఖ, గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు, భక్తులు, శ్రీ లలిత సేవా సంఘం సభ్యుల సమక్షంలో ఉదయం 10 గంటలకు హుండీ లెక్కించగా గత ఐదు నెలలకు సంబంధించి మొత్తం రూ.1,69,382 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సార శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మెదక్ డివిజన్ హుండీ పరిశీలకులు వి. రంగారావు, సర్పంచ్ అరుణ రెడ్డి, ఉపసర్పంచ్ ఏనుగు ప్రభాకర్ రెడ్డి, ఆర్. నర్సింలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవి రవీందర్ పై దాడిని ఖండించిన దళిత, ప్రజా సంఘాల నాయకులు



**కొండపాక/కుకునూర్ పల్లి వుదయం**

వారం రోజులకింద లకుడారం గ్రామానికి చెందిన బీఆరెస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పై కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు దాడి చేయడంచూస్తుంటే ప్రజాస్వామ్యం బతికే ఉందా అనే అనుమానం కలుగుతుందన్నారు దళిత, ప్రజా సంఘాల నాయకులు.మంగళవారం రోజు దేవి రవీందర్ ను వారి స్వగృహంలో కలిసి దాడి కి సంబదించిన వివరాలను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల నాయకులు, మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఆస లక్ష్మణ్, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, న్యాయవాది పల్లెటూరి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ లకుడారం గ్రామంలో కులాలకు అతీతంగా, ఆనందోత్సవాల మధ్య జరుపుకునే దసరా, బతుకమ్మ పండుగలలో రాజకీయ పార్టీల ముసుగులో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు అల్లరి సృష్టించడం తగదన్నారు. దేవి రవీందర్ పై దాడి చేసి కారు అద్దాలను ధ్వంసం చేయడం, దూషించడం సిగ్గుచేటు అన్నారు. గ్రామానికి చెందిన మైసమ్మ గుడికి తాళం వేయడం చూస్తే కాంగ్రెస్ దుండగుల ఆటవిక చర్యలు ఎలా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, దళిత నాయకుల పై జరుగుతున్న దాడుల వెనుక మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి హస్తం ఉన్నట్టు స్పష్టమవుతుందన్నారు. రాజకీయాలలో ఎదుగుతున్న ఎస్సీ నాయకులపై దాడి చేయడం వారి ఓర్వలేని తనానికి నిదర్శనం అని, ఇలాంటి పద్ధతులు సరైనవి కాదన్నారు.ఇప్పటికైనా వారి ప్రవర్తన మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరిస్తూ, గ్రూప్ రాజకీయాలు మానుకోవలన్నారు. అక్రమంగా బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన సిసి ఫుటేజ్ లు స్పష్టంగా ఉన్నప్పటికీ దాడి చేసిన వారిపై కేసులు పెట్టకుండా అధికార పార్టీ నేతల కనుసన్నలలో పోలీస్ వ్యవస్థ నడుచుకుంటున్నట్టు అర్థమవుతుందన్నారు. దేవి రవీందర్ ముందుగా ఇచ్చిన ఫిర్యాదు కాదని, తరువాత కాంగ్రెస్ పార్టీ వాళ్ళు ఇచ్చిన ఫిర్యాదు నే మొదటి ఎఫ్ఐఆర్ గా నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కింద నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షం లో జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి వెనకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు రాజేందర్, సతీష్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# దిగ్వాల్ భూసమస్యలపై స్పష్టత నివ్వాలి

## మంత్రుల సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్ రావు!





**ఝరాసంగం అక్టోబర్-27(వుదయం ప్రతినిధి)**

సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మంత్రులు *పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, దామోదర రాజనర్సింహ గారు, వివేక్ వెంకటస్వామి గారు ,జిల్లా శాసనసభ్యులు గార్లతో కలిసి ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు గారు* పాల్గొన్నారు.ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు గారు మాట్లాడుతూ ఎల్లినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు,అర్హులైన లబ్ధిదారులకు *ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను* ఎలాంటి పక్షపాతం లేకుండా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామ పరిధిలోని భూ సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు.దిగ్వాల్ గ్రామ పరిధిలో పారిశ్రామిక పార్కు స్థాపన కోసం TSIIC సంస్థకు అనుకూలంగా మొత్తం *782.22 ఎకరాల అసైన్డ్, పట్టా భూముల సేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు* ఉన్నాయని తెలిపారు. ఇందులో 572.01 ఎకరాల అసైన్డ్ భూములు, 210.21 ఎకరాల పట్టా భూములు ఉన్నట్లు పేర్కొన్నారు.అయితే, ఆయా భూములకు సంబంధించిన కొన్ని సర్వే నంబర్లు, పట్టాదారుల వివరాలు, భూముల హక్కులు, భూములు ఏ విధంగా సంక్రమించాయనే అంశాలపై స్పష్టత అవసరమని తెలిపారు. అదేవిధంగా, కొన్ని సర్వే నంబర్లలో అటవీ భూములు, వక్ఫ్ భూములు ఉన్నట్లు నివేదికల్లో ప్రస్తావించబడిన నేపథ్యంలో, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భూముల వాస్తవ స్థితిగతులను నిర్ధారించి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. భూ సమస్యలపై సమగ్ర నివేదిక రూపొందించి, సంబంధిత శాఖల సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాణిక్ రావు గారు సూచించారు.దిగ్వాల్ గ్రామ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, అన్ని అంశాలను పారదర్శకంగా పరిశీలించాలని ఆయన కోరారు.

# విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**కేశంపేట**

నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పరమేశ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు ఆన్లైన్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల పట్ల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల విషయంలో విద్యార్థులు అప్రమత్తత ఎంతో అవసరమని సూచించారు.మాదకద్రవ్యాల వాడకం వల్ల యువతలో దుష్ప్రభావాలు పెంపందుతాయని వాటికి నిర్మూలనలో భావంగానే యువతకు ఆన్లైన్లో పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.యువత సరైన మార్గంలో పయనిస్తూ, నేరరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.....

# హరీష్ రావుతో కేసీఆర్ నగర్ నేతల మర్యాదపూర్వక భేటీ..

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 27)**

తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేజ్ 2కు చెందిన 65వ బ్లాక్ బీఆర్ఎస్ నాయకులు రవి, అనిల్ రాథోడ్ మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును ఆయన నివాసంలో కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హరీష్ రావు వారికి దిశానిర్దేశం చేశారు.



# భారతీయ పసుపు ఎగుమతులపై పరిశోధన..

**సిద్దిపేట పద్మజకు డాక్టరేట్**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి :**

భారతీయ పసుపు ఎగుమతుల పోటీతత్వంపై పరిశోధన చేసిన సిద్దిపేటకు చెందిన పొన్నమనేని పద్మజకు ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) ప్రొఫెసర్ ఈ. రేవతి పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు. 'ఎక్స్‌పోర్ట్ కాంపిటీటివ్‌నెస్ ఆఫ్ ఇండియన్ టర్మరిక్: ఎ పోస్ట్ డబ్ల్యూటీవో అనాలిసిస్' అనే అంశంపై పద్మజ సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి తెలంగాణ విశ్వవిద్యాలయం ఆమోదం తెలిపింది.



ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుకు అనంతర కాలంలో భారతీయ పసుపు ఎగుమతుల తీరు, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీతత్వం, ఎగుమతుల అవకాశాలను ఆమె పరిశోధనలో విశ్లేషించారు. పద్మజ డాక్టరేట్ సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.



# గ్రేటర్ హైదరాబాద్






## పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన

- ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్.. 100 మంది విద్యార్థులకు పోలీసుల పనితీరుపై వివరణ

**ఆమనగల్లు, అక్టోబర్ 27 (వుదయం):**
పోలీసుల విధులు, చట్టాల అమలు, నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా అరబిందో హైస్కూల్‌కు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సంతోష్ రెడ్డి, ఏఎస్‌ఐ రామ్ రెడ్డి, పోలీసు సిబ్బంది విద్యార్థులకు పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల విధులు, ఫిర్యాదుల స్వీకరణ, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం గురించి వివరించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిర్వహించే పాత్రను తెలియజేశారు. అక్టోబర్ 21న నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ, దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను విద్యార్థులకు వివరించారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, పోలీసుల విధులపై అవగాహన పెంపొందుతుందని పోలీసులు పేర్కొన్నారు.

# దివ్యాంగుల ఆర్థిక ప్రగతే లక్ష్యం

## సెర్ప్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ల కీలక భాగస్వామ్యం!

- దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి సెర్ప్ మరియు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కృషి

**సంగారెడ్డి (వుదయం)**
దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ స్వయం ఉపాధి రంగంలో రాణించాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సెర్ప్ సంస్థ యొక్క సహకారంతో నిరంతరం కృషి చేస్తోందని ఫౌండేషన్ టెర్రటరీ మేనేజర్ రవిప్రకాష్ గారు తెలిపారు. సంగారెడ్డి, సదశివాపేట మండలాలకు చెందిన దివ్యాంగులకు స్వయం ఉపాధి అవకాశాలు, వ్యాపార నిర్వహణ, ఆర్థిక ప్రణాళిక, మార్కెటింగ్ పద్ధతులు మరియు చిన్న వ్యాపారాల అభివృద్ధిపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మరియు సెర్ప్ ఆధ్వర్యంలో సంగారెడ్డి లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ శిక్షణ ద్వారా దివ్యాంగులు తమ నైపుణ్యాలను అభి



వృద్ధి చేసుకొని స్వంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా స్వావలంబన సాధించగలరని నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలపై వారికి అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది మాట్లాడుతూ, దివ్యాంగులను సమాజంలో ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడం కోసం ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దివ్యాంగులు కూడా ఇతరుల మాదిరిగానే ప్రతిభ కలిగిన వారేనని, సరైన అవకాశాలు మరియు మార్గదర్శకత్వం కల్పిస్తే వారు విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగగలరని పేర్కొన్నారు.అనంతరం డి ఆర్ డి ఏ సంగారెడ్డి, సదశివాపేట మండల సమాఖ్య ఏ పి యమ్ లు శ్రీమతి ప్రేమలత మరియు శ్రీనివాస్ గార్లు డి ఆర్ డి ఏ తరపున దివ్యాంగుల అభివృద్ధికి సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించుట జరిగింది కార్యక్రమం తరువాత దివ్యాంగులకు గ్రాంట్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ గ్రాంట్లు వారి స్వయం ఉపాధి వ్యాపారాల ప్రారంభానికి ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంగారెడ్డి జిల్లా క్లస్టర్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ మరియు రాజవర్ధన్ , మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



## మహా రుద్రాభిషేకం విజయవంతం

- ఆదర్శ్ రెడ్డిని కలిసిన భాస్కర్ రెడ్డి

**రామచంద్రపురం అక్టోబర్ 27 (వుదయం)**
జయలక్ష్మి నగర్ ఫేజ్ 2లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఇటీవల నిర్వహించిన మహా రుద్రాభిషేకం, పుష్పార్చన కార్యక్రమాలు విజయవంతంగా ముగియడంతో ఆలయ నిర్వాహకులు, మాజీ వార్డు మెంబర్ భాస్కర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులతో కలిసి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన నాయకులకు, దాతలకు, కాలనీవాసులకు భాస్కర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి, మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహకారం అందించాలని కోరారు.

## ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం



- భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణకు ప్రాధాన్యం..
- ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి : సర్పంచ్ వడ్త్యావత్ శ్రీనునాయక్

**ఆమనగల్లు, అక్టోబర్ 27 (వుదయం) :**
భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ లక్ష్యంగా రాంనుంతల గ్రామ పంచాయతీ పరిధిలోని గేటుతండాలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ వడ్త్యావత్ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సర్పంచ్ సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేశ్వరి మోహన్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు సరిత ధనరాజ్, పార్వతి భాస్కర్, అనిత కృష్ణ, గ్రామ నాయకులు రవి, యువకులు పవన్, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి..

- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రేపు రక్తదాన శిబిరం..
- యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలి : సీఐ వెంకటేశ్వర్లు

**ఆమనగల్లు, అక్టోబర్ 27 (వుదయం) :**
రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో లయన్స్ క్లబ్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు




చెందిన యువత, స్వచ్ఛంద రక్తదాతలు శిబిరంలో పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎవరూ ఇబ్బందులు పడకుండా రక్తదాతలు ముందుకు రావాలని, రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతగా భావించి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు.

# నీటి సంరక్షణపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- 7వ వార్డు మెంబర్ ప్యార్ల విజయలక్ష్మి యాదయ్య
- .నీటిని ప్రతి చుక్కా పొదుపు చేసుకోవాలి
- .వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- లీకేజీలను అరికట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టాలి
- ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత రాకుండా అప్రమత్తంగా ఉండాలి

**శంకర్‌పల్లి అక్టోబర్ 27 (వుదయం)**
నీరు జీవకోటికి ఆధారం. నీరు లేనిదే మనిషి మనుగడ సాధ్యం కాదు. అలాంటి విలువైన నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి సంరక్షణపై ప్రజలు ఇప్పటి నుంచే దృష్టి సారించాలి. నీరు సమృద్ధిగా లభిస్తు



న్న సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, భవిష్యత్తులో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని మహారాజుపేట గ్రామం 7వ వార్డు మెంబర్ ప్యార్ల విజయలక్ష్మి యాదయ్య సూచించారు.ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో నీటి వృథా ప్రధాన సమస్యగా మారుతోంది. ఇళ్లలో కుళాయిలు తెరిచి వదిలేయడం, పైపులైన్లలో లీకేజీలు ఏర్పడినా వెంటనే మరమ్మతులు చేయించకపోవడం, అవసరానికి మించి నీటిని వినియోగించడం వల్ల విలువైన నీరు వృథా అవుతోంది. చిన్న లీకేజీగా కనిపించినా గంటలు, రోజులు గడిచేకొద్దీ పెద్ద మొత్తంలో నీరు వృథా అవుతుంది. అందువల్ల ఇళ్లలో, వీధుల్లో, వ్యవసాయ ప్రాంతాల్లో ఎక్కడైనా నీటి లీకేజీలు కనిపిస్తే వెంటనే సంబంధిత బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించాలి. నీటి సరఫరా సమయంలో కుళాయిలను అవసరమైనంతసేపే ఉపయోగించాలి. ట్యాంకులు నిండిన తర్వాత మోటార్లను ఆపివేయడం, వాహనాలు కడగడానికి పైపులతో అధికంగా నీటిని వృథా చేయకుండా బకెట్లను ఉపయోగించడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా నీటి పొదుపునకు దోహదపడతాయి.వర్షపు నీటిని సంరక్షించుకోవడం కూడా ఎంతో ముఖ్యమైన విషయం. ఇళ్ల పైకప్పులపై పడే వర్షపు నీటిని పైపుల ద్వారా ఇంకుడు గుంతలకు మళ్లించడం, ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ఏర్పాట్లు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చు. గ్రామాల్లోని బావులు, బోరుబావుల్లో భూగర్భ జలాల మట్టాలు మెరుగుపడేందుకు ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయి. వర్షం వచ్చినప్పుడు నీరు రోడ్లపైకి వెళ్లి వృథా కాకుండా, సాధ్యమైనంత వరకు భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలి. ప్రతి ఇంటి యజమాని తన పరిధిలో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గినా, ఎండల తీవ్రత పెరిగినా నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితులు ఎదురైతే వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చడం మరింత కష్టమవుతుంది. అందుకే వేసవి కాలం వచ్చే వరకు వేచి చూడకుండా ముందుగానే నీటి వనరులను కాపాడుకోవాలి. బోరుబావుల నుంచి అవసరమైన మేరకే నీటిని వినియోగించాలి. భూగర్భ జలాలపై అధికంగా ఆధారపడకుండా వర్షపు నీటిని ఒడిసిపట్టే విధానాలను ప్రోత్సహించాలి. నీటి వనరులు కలుషితం కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తాగునీటిని నిల్వ చేసుకునే పాత్రలను శుభ్రంగా ఉంచడంతో పాటు నీటిని వృథా చేయకుండా కుటుంబ సభ్యులందరూ అలవాటు చేసుకోవాలి.నీటి సంరక్షణ అనేది ఒక్కరి బాధ్యత మాత్రమే కాదు. ప్రతి కుటుంబం, ప్రతి వీధి, ప్రతి గ్రామం సమష్టిగా ముందుకు వచ్చినప్పుడే మంచి ఫలితాలు సాధించగలం. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరికీ నీటి విలువను తెలియజేయాలి. నీరు వృథా అవుతున్న చోట్ల వెంటనే స్పందించి, పొదుపు చర్యలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలి. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించాలంటే నేటి నుంచే బాధ్యతాయుతమైన చర్యలు చేపట్టాలి. నీటిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమేనని మహారాజుపేట గ్రామం 7వ వార్డు మెంబర్ ప్యార్ల విజయలక్ష్మి యాదయ్య పేర్కొన్నారు.



## పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- ఎంపీ డీకే అరుణ

**కేశంపేట**
మారుమూల ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం ఆమె క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన బిజెపి మండల అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నూతన అధ్యక్షులు కృషి చేయాలని సూచించారు.భారతీయ జనతా పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని, పార్టీ అభివృద్ధికి తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని శ్రీనివాస్ ఆమెకు హామీ ఇచ్చారు. ఆమెను కలిసిన వారిలో బిజెపి నాయకులు తట్టెపల్లి నర్సింలు, పద్మ కృష్ణయ్య కార్యకర్తలు ఉన్నారు...

# సిబ్బంది సమిష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి

- ఆదర్శ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో మేడిపల్లి సీఐ డి. జలేందర్ రెడ్డి

**మేడిపల్లి వుదయం ప్రతినిధి అక్టోబర్ 27.**
సిబ్బంది అంకితభావం, సమిష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ డి. జలేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల టీజీఎస్ ఆర్టీసీ డిపోలో సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేస్తూ ఆదర్శంగా నిలిచిన ఉద్యోగులను సన్మానించారు.ఈ సందర్భంగా సీఐ జలేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏ ఓ సంస్థ అయినా అభివృద్ధి సాధించాలంటే సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదరహిత ప్రయాణ సౌకర్యాన్ని అందించడం ద్వారా ప్రజల్లో ఆర్టీసీపై నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ మనుగడ, అభివృద్ధికి ఇంధన పొదుపు ఎంతో కీలకమని, ఈ విషయంలో ప్రతి ఉద్యోగి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను నిజాయితీగా, నిబద్ధతతో నిర్వర్తిస్తే సంస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.
అనంతరం సంస్థ అభివృద్ధికి కృషి చేసిన ఆదర్శ



ఉద్యోగులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎస్ ఐ ఉదయ్‌భాస్కర్, డిపో మేనేజర్ స్వాతి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రమాదాలకు చెక్ పెట్టాలి!

- బ్లాక్ స్పాట్లపై ట్రాఫిక్ డీసీపీ క్షేత్రస్థాయి పరిశీలన..
- ఆక్రమణలు తొలగించాలని ఆదేశం

**ఆమనగల్లు, అక్టోబర్ 27 (వుదయం) :**
రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ శివమ్ ఉపాధ్యాయ అధికారులను ఆదేశించారు. ఆమనగల్లు పట్టణ పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లతో పాటు ఎన్‌హెచ్ 765 జాతీయ రహదారిని మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. రహదారులపై ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారుతున్న దుకాణాలు, ఆక్రమణలను తొలగించాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టి, వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే సమస్యలను గుర్తించి,
వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సీఐ శంకరయ్య, ఆమనగల్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, మహేశ్వరం ట్రాఫిక్ సీఐ అశోక్, మున్సిపల్ కమిషనర్ రాఘువేందర్ రెడ్డి, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## రామన్నగూడ అభివృద్ధికి మరో ముందడుగు!

- రూ.43 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం
- శంకుస్థాపన చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల,అక్టోబర్27 (వుదయం)**
చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు మరింత ఊతమిస్తూ రామన్నగూడలో రూ.43 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శంకుస్థాపన చేశారు.మున్సిపాలిటీలోని 10వ వార్డులో ఈ పనులకు శ్రీకారం చుట్టారు.ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలే లక్ష్యం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించడంతోపాటు, స్థానికంగా నెలకొన్న రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు.రామన్నగూడ 10వ వార్డులో రూ.43 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకల్లో మెరుగైన సౌకర్యం కలగనుంది.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



**IN THE COURT THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: RAJENDERNAGAR**
**O.S.NO. 622 OF 2026**

**Between :**
SANTOSH NUTI And another ...PLAINTIFFS
**AND**
THE TAHSILDAR, Gandipet Mandal And another ...DEFENDANTS
D-2 ALL CONCERNED

**PUBLIC NOTICE**
The Plaintiffs had filed the above suit for Declaration to Declare the Plaintiffs as Legal Heirs of deceased of LATE ELIZABETH RANI K C who died on 26.09.2020 against the Defendants which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 18.11.2026 at 10.30 a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

**(BY ORDER OF THE COURT)**
**Sd/-**
**K.SATYANARAYANA GOUD**
**Advocate,**
**H.No.1-3-33, Budwel,**
**Rajendranagar Mandal Ranga Reddy District.**




**IN THE COURT OF THE HON'BLE III JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S. No. 3217 of 2026**

**Between :**
1. VIJAY LAXMI W/o: Sanjay Kumar @sanjay singh Aged about 50 years, Occ: Household, R/o: H.No. 14-11-509, Mangalhat, Nampally, Hyderabad – 500012.
2. VISHNU SINGH S/o: Sanjay Singh @ sanjay kumar Aged about 26 years, Occ: Private Employee,
3. JAGDISH SINGH S/o: Sanjay Singh,@ sanjay kumar Aged about 24 years, Occ: Business,
4. ABHISHEK SINGH S/o. Sanjay Singh@ sanjay kumar Aged about 21 years, Occ: Business, All are R/o: H.No. 14-11-509, Mangalhat, Nampally, Hyderabad – 500012.

...Plaintiff No. 1 to 4

**AND**
1. The Tahsildar / Mandal Revenue Officer Nampally, Hyderabad
2. All Concerned

...Defendants

To,
All Concerned
Please take notice that the above O.S. No. 3217 of 2026 filed by the Plantiffs to declare her as a legal Heir of Deceased Late. Sanjay Kumar for the purpose of legal status against the defendants. Before the Hon'ble III JUNIOR CIVIL JUDGE, City Civil Court, Hyderabad. The same is posted on 05-11-2026 at 10:30 AM for your appearance. Be present on the above date and time, when the case will be taken up for consideration. You can appear in person or through your Advocate, failing which, the matter will be heard and decided as per the Law and Rules.

**//By order of the Hon'ble Court//**
**Sd/-**
**M/s. PRATHIBHA SINGH**
**Advocate Off: 14-10-44, JINSI CHOWRAHI, Hyderabad-12**
**Cell No. 6281629495**

**PUBLIC NOTICE**

**INVITING CLAIMS AND OBJECTIONS IN RESPECT OF PROPOSED PURCHASE OF IMMOVABLE PROPERTY**, Notice is hereby given to the general public that my client, Sri Sudam Doary, S/o. Sri Sufal Doary, aged about 41 years, Occupation: Business, resident of H. No. 21-3-627/1, Imli ka jhar, Mehendi Mahbub, Charminar, Hyderabad, Telangana, is intending to purchase the immovable property more fully described in the Schedule hereunder from the following proposed vendors:
1. **Smt. M. Anna Thamma**, W/o. Sri M. Jangaiah; age – 60 years, occ- house wife (and)
2. **Sri M. Manikyam**, S/o. Sri M. Jangaiah, age – 35 years both stated to be residents of E. No. 2-57, Regadwasa Village, Shabad Mandal, Ranga Reddy District, Telangana.

Therefore, any person, individual, institution, bank, financial institution, or other entity having any right, title, interest, share, claim, demand, objection, mortgage, charge, lien, agreement of sale, prior sale transaction, litigation, attachment, encumbrance, or any other legal claim whatsoever in respect of the schedule-mentioned property is hereby called upon to intimate the same in writing, along with supporting documentary evidence, to the undersigned Advocate within **5(Five) days from the date of publication of this notice.**

**SCHEDULE OF PROPERTY**
All that piece and parcel of agricultural land admeasuring **30 (thirty) guntas**, situated at **Regadi Doswasa Village, Shabad Mandal, Telangana**, falling in **Survey No. 140/3/1/2**, together with all rights, easements and appurtenances attached thereto, and more particularly identifiable by its boundaries and revenue record.

**ADVOCATE**
**Sri. Hironmoy Debnath**
**21-1-411 rikabgunj**
**Hyderabad -50002, T.S**
**Cell: 9398308202**



“సైనిక దళాల ఆధునికీకరణలో భాగంగా భారత రక్షణ శాఖ రూ.2.12 లక్షల కోట్ల విలువైన ఆయుధ వ్యవస్థలు, మిలిటరీ పరికరాల కొనుగోలుకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యాంశంగా, ప్రతిపాదించిన ఈ మొత్తంలో దాదాపు 82 శాతం కొనుగోళ్లు దేశీయ పరిశ్రమల నుంచే చేపట్టనున్నారు.”

- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

## వే‘మన’ పద్యం

హీనుఁడెన్ని విద్యలు నేర్చినఁగాని
ఘనుఁడుఁగాడు హీనజనుఁడె కాని
పరిమళములు మోయ ఖరము తా గజమౌనె
విశ్వదాభిరామ! వినుర వేమ!



# సంపాదకీయం

## స్వపరిపాలనకు తూట్లు..

గాంధీజీ కలలు కనిన గ్రామ స్వరాజ్యానికి, పరిపాలనా వికేంద్రీకరణకు వెన్నెముక వంటివి స్థానిక స్వపరిపాలనా సంస్థలు. రాజ్యాంగంలోని 73, 74వ సవరణలు స్థానిక సంస్థలకు అపారమైన అధికారాలు, నిధులు, విధుల కేటాయింపు ద్వారా స్వయం ప్రతిపత్తిని కల్పించాయి. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం, ఆయా వ్యవస్థల దయనీయ స్థితిని పరిశీలిస్తే పాలకులు రాజ్యాంగ స్ఫూర్తిని ఏ స్థాయిలో దెబ్బతీస్తున్నారో స్పష్టమవుతోంది. అధికారాల వికేంద్రీకరణ కాస్తా ‘అధికార దుర్వినియోగం’గా మారిపోవడం తీవ్రంగా ఆందోళన కలిగించే పరిణామం. ఎన్నికల ప్రక్రియ ఆరంభం నుంచే ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు, నామినేషన్ల దాఖలును అడ్డుకోవడం, భౌతిక దాడులకు తెగబడటం వంటి వార్తలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసస్పదం చేస్తున్నాయి. పోలీసు, ఎన్నికల యంత్రాంగాలు అధికార పార్టీ చేతుల్లో కీలుబొమ్మలుగా మారాయన్న ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యంతో షెడ్యూల్ సవరించాల్సి రావడం గమనార్హం. ప్రజాస్వామ్య బద్ధంగా జరగాల్సిన ఎన్నికలను బలప్రదర్శనగా మార్చడం స్థానిక నాయకత్వ అభివృద్ధికి గొడ్డలిపెట్టు. మరోవైపు, పాలకుల నియంతృత్వ ఆర్థిక చర్యల వల్ల పంచాయతీలు, మున్సిపాలిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నాయి. గత 15 ఏళ్లుగా రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు ఒక్క రూపాయి కూడా స్థానిక సంస్థలకు విడుదల కాకపోవడం, జనాభా ప్రాతిపదికన ఇవ్వాల్సిన కనీస తలసరి గ్రాంట్లను నిలిపివేయడం దారుణం. స్థానిక సంస్థల ఆస్తి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వంటి సొంత ఆదాయాలను సైతం 'సీఎఫ్ఎంఎస్' ద్వారా రాష్ట్ర ఖజానాకు మళ్లించుకోవడం రాజ్యాంగ ఉల్లంఘనే. కేవలం నిధుల దారిమళ్లింపే కాక, నయా ఉదారవాద విధానాల పేరుతో వీధి దీపాలు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా వంటి ప్రాథమిక పౌరసేవలను జీవో 673 ద్వారా ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం స్థానిక స్వపరిపాలనను మరింత నిర్వీర్యం చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'పంచాయితీల అభివృద్ధి సూచీ'లో రాష్ట్రంలోని 13,354 పంచాయతీల్లో ఒక్కటి కూడా ‘ఏ ప్లస్’ గ్రేడ్ సాధించలేకపోవడమే వీటి దయనీయ స్థితికి ప్రత్యక్ష నిదర్శనం. నిధులు, విధులు, నిర్వహణాధికారాల బదిలీలో కేరళ వంటి రాష్ట్రాలు ఆదర్శంగా నిలుస్తుంటే, మన రాష్ట్రం అట్టడుగు స్థానాల్లో కొట్టుమిట్టాడుతోంది. స్థానిక సంస్థలు అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే అనుబంధ సంస్థలు కావు, అవి స్వతంత్రంగా పనిచేయాల్సిన ప్రజాస్వామ్య వ్యవస్థలు. పాలకుల స్వార్థ రాజకీయాలు, ఆర్థిక అణచివేత ధోరణి వీడి, రాజ్యాంగబద్ధంగా రావలసిన నిధులను, అధికారాలను స్థానిక సంస్థలకు తక్షణమే కట్టబెట్టినప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుంది.

ఎన్నికల ప్రక్రియ ఆరంభం నుంచే ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు, నామినేషన్ల దాఖలును అడ్డుకోవడం, భౌతిక దాడులకు తెగబడటం వంటి వార్తలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసస్పదం చేస్తున్నాయి.


**రచనలు పంపండి**

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


## పాశ్చాత్య వేదాంతి.. మాక్స్ ముల్లర్ వర్ధంతి

మాక్స్ ముల్లర్ 19వ శతాబ్దంలో భారతీయ సాహిత్యాన్ని పాశ్చాత్య ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప భాషావేత్త, తాత్వికుడు, తులనాత్మక మత శాస్త్రవేత్త. ఆయన భారతీయ వేద సాహిత్యానికి చేసిన సేవల కారణంగా భారతీయ సాంస్కృతిక అధ్యయనాల్లో ఓ కీలక స్ఫూర్తి దాయక వ్యక్తిగా నిలిచారు.

మాక్స్ ముల్లర్ 1823 డిసెంబర్ 6న జర్మనీలోని డెసావ్ పట్టణంలో జన్మించారు. ఆయన తండ్రి ప్రముఖ కవి, రచయిత. చిన్నతనం నుండే ముల్లర్‌కు భాషలపై ఆసక్తి పెరిగింది. లైప్జిగ్ విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రం (Philology) చదివిన ముల్లర్, తరువాత ఫ్రాన్స్ మరియు ఇంగ్లాండ్‌లో సంస్కృతం, తత్వశాస్త్రంలో తన అధ్యయనాలను విస్తరించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా స్థిరపడి, తన సార్వత్రిక పరిశోధనలను కొనసాగించారు.

మాక్స్ ముల్లర్ భారతీయ సాహిత్యం, ముఖ్యంగా వేదాల పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం వంటి వేదాలను పఠించి, వాటిని పాశ్చాత్య సమాజానికి పరిచయం చేయడం కోసం ఇంగ్లిష్‌లో అనువదించారు.

ఆయన ముఖ్యమైన రచనల్లో “సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్” (Sacred Books of the East) ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఇది 50 సంపుటాల గ్రంథమాలగా ప్రచురించబడింది. ఇందులో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బౌద్ధ గ్రంథాలు, జైన గ్రంథాలు, ఇస్లామిక్ మరియు జరస్త్రియన్ గ్రంథాల అను



వాదాలు ఉన్నాయి.

ముల్లర్, తులనాత్మక మత శాస్త్రానికి పునాది వేశారు. భిన్న మతాలు, సాంస్కృతిక గ్రంథాల తులనాత్మక విశ్లేషణ చేయడం ద్వారా మానవ సమాజాల ఆధ్యాత్మిక వికాసాన్ని అర్థం చేసుకోవచ్చని విశ్వసించారు. భారతీయ తత్వశాస్త్రం మరియు పాశ్చాత్య తత్వం మధ్య సారూప్యాలను గుర్తించి, రెండు సంస్కృతుల మధ్య అనుబంధాన్ని ఆవిష్కరించారు.

ముల్లర్ ముఖ్యంగా వేదాలను “మానవతా చింతనకు మూలాధారాలు” అని పేర్కొన్నారు. ఆయన దృష్టిలో వేదాలు కేవలం హిందువుల పుణ్య గ్రంథాలు మాత్రమే కాదు, ప్రపంచ మానవాళికి చెందిన ఆధ్యాత్మిక మౌలిక గ్రంథాలు.

ముల్లర్ భారతీయ సంస్కృతిని గౌరవంతో పరిగణించేవారు. “వేదాలు భారతీయుల ఆత్మ” అని పేర్కొంటూ, భారతీయుల ఆధ్యాత్మిక జీవన విధానాన్ని సానుకూల దృక్కోణంతో విశ్లేషించారు. ఆయనకు భారతీయ ధర్మం, తాత్త్విక సూత్రాల పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. అయితే, కొందరు విమర్శకులు ముల్లర్‌పై పాశ్చాత్య వలసవాద దృక్కోణంతో భారతీయ సాహిత్యాన్ని అర్థం చేసుకున్నారని అభిప్రాయపడ్డారు. ఆయన అనువాదాలు పాశ్చాత్య పాఠకుల కోసం కాస్త మార్పుచేర్పులు చేయబడ్డాయని విమర్శనాత్మకంగా పేర్కొన్నారు.

ముల్లర్ జీవితకాలంలో అనేక కీలక రచనలు చేసారు, వాటిలో కొన్ని ముఖ్యమైనవి: ఋగ్వేదంపై విశ్లేషణ, ఉపనిషత్తుల అనువాదాలు, ప్రాచీన ఆధ్యాత్మిక గ్రంథాల సమాహారం. తాత్త్విక వ్యాసాల సమాహారం.

ముల్లర్ చేసిన అనువాదాలు, విశ్లేషణలు విస్తృతంగా గౌరవించబడ్డప్పటికీ, కొన్ని విమర్శలు ఎదుర్కొన్నాయి. భారతీయ మతసాంప్రదాయాలపై పాశ్చాత్య అర్థాలు రుద్దబడ్డాయని, పాశ్చాత్య పరిశోధనల పట్ల మక్కువతో తాత్త్విక అంశాలను ఒడిసిపట్టాడని విమర్శకులు అభిప్రాయపడ్డారు.అయినప్పటికీ, భారతీయ వేద సాహిత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించిన ముల్లర్ కృషి చిరస్థాయిగా నిలిచింది.మాక్స్ ముల్లర్ 1900 అక్టోబర్ 28న మరణించాడు. ఆయన సాహిత్యకృషి భారతీయ సాహిత్య, తాత్విక అధ్యయనాలపై ఎనలేని ప్రభావం చూపింది. భారతీయ వేదాలు, తత్వశాస్త్రాలపై పాశ్చాత్య ఆసక్తి పెరగడానికి ఆయన కృషి దోహద పడింది.

మాక్స్ ముల్లర్ ప్రపంచానికి భారతీయ సంస్కృతిని పరిచయం చేసిన గొప్ప పాశ్చాత్య వేదాంతి. ఆయన చేసిన తాత్త్విక, సాహిత్య కృషి, వేదాలపై చేసిన విశ్లేషణలు భారతీయ, పాశ్చాత్య ప్రపంచాల మధ్య సంస్కృతిక మార్పిడి సాధించాయి. భారతీయ సాహిత్యం, తాత్త్వికతపై ముల్లర్ చూపిన ఆసక్తి, శ్రద్ధకు భారతీయులు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

మాక్స్ ముల్లర్ భారతీయ సాహిత్యం, ముఖ్యంగా వేదాల పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం వంటి వేదాలను పఠించి, వాటిని పాశ్చాత్య సమాజానికి పరిచయం చేయడం కోసం ఇంగ్లిష్‌లో అనువదించారు.




రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్


## పెన్సిల్ రబ్బర్

జీవితం మోసపోవడం
కూడా నేర్పుతుంది
అమ్మనాన్నలు తొలి దశలో
నడక నేర్పిస్తారు
జీవిత ఆటుపోట్లు
నిలబడడం నేర్పుతాయి !

ఎంతో అనిర్వచనీయ
ప్రశాంతత గొడుగు !

పీత కష్టాలు పీతవి, ఎవరి
రంది వారిదే !

ఇల్లు, సంపాదన చిన్నవైనా
ఫర్వాలేదు
మనసు, సంస్కారం
విశాలంగా ఉండాలి
ఇల్లు విశాలం మనసు
కురుస ఉండొద్దు !

నేడు అన్నింటికీ ధనమే
ప్రధానమైంది
గుణం ఉన్నోడికి కనీస
గౌరవం పలుచన..
మంచితనాన్ని వదిలి పైసల
వెంట పడదామా !

పంటలన్నీ ఒకే బాయి
నీటిని తాగుతాయి
కాని కాకర, అరటి, పల్లీ
రుచులు వేరు వేరు
రుచికి కారణం నీరు కాదు
బీజం మాత్రమే !

తన వారి తప్పులను సదా
సవరిస్తూనే..
పెన్సిల్ కన్న ముందే
అరిగిపోతుంది రబ్బర్
తనోళ్లను సవరిస్తూ
జీవిస్తారు త్యాగమయులు !

మందు, ప్రేమ రెండూ
మత్తును ఇస్తాయి
మందు తాగితే గమ్మత్తుగా
నిద్ర ఆవహిస్తుంది
ప్రేమానురాగాలు నిద్రను
దూరం చేస్తాయి !

సమయం వరకు వేచి
ఉండాల్సిందే
నీ సమయం రావడానికి
సరైన టైం రావాలి
టైం కలిసొస్తే ఎడారి
కూడా హిమ మైదానమే !

మనిషికి మనిషికీ ఏదో
తెలియని ఘర్షణ..
ఒక మనిషి దగ్గరైతే,
మరొకరు దూరమైతే..

ఎదుటోళ్లను చూసి
జీవితాలను పోల్చవద్దు
తోటోళ్ల ముఖమే
కనపడుతోంది వీపు కాదు


మధుపాళీ
9948700037


# నీటి ముప్పు ముంచుకొస్తోంది.. పాలకులు మేల్కొనేది ఎప్పుడు?



తెలంగాణలో వర్షపాతం లోటు.. జలాశయాల్లో తగ్గుతున్న నిల్వలు.. రైతు భవిష్యత్తుపై నీలినీడలు గణాంకాలు హెచ్చరిస్తున్నా ముందస్తు కార్యాచరణ ఏది?

తెలంగాణలో నీటి భద్రతపై ఆందోళన కలిగించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వర్షపాతం లోటు, జలాశయాల్లో తగ్గుతున్న నిల్వలు, భూగర్భజలాలపై పెరుగుతున్న ఒత్తిడి.. ఇవి రాబోయే నెలల్లో తాగునీరు, సాగునీటి నిర్వహణకు సవాలుగా మారే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ప్రకృతి మన చేతుల్లో లేకపోవచ్చు. కానీ అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించడం, వృథాను అరికట్టడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేయడం మాత్రం ప్రభుత్వ బాధ్యత. నీటి ఎద్దడి ఏర్పడిన తర్వాత హడావుడి చేయడం కాదు.. సమస్య రాకముందే మేల్కొనడమే సమర్థ పాలన.

వర్షపాతం లోటు.. హెచ్చరికను పట్టించుకునేదెవరు?తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక, గణాంకాల సంచాలక శాఖ సమాచారం ప్రకారం, 2026 జూన్ 1 నుంచి అక్టోబర్ 26 వరకు రాష్ట్రంలో 619 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 824.2 మిల్లీమీటర్లు కాగా, 205.2 మిల్లీమీటర్ల లోటు నమోదైంది. అంటే సాధారణంతో పోలిస్తే సుమారు 25 శాతం తక్కువ వర్షం కురిసింది.

ఈ లోటు వ్యవసాయం, చెరువుల నిల్వలు, భూగర్భజలాల పునరుద్ధరణపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే రాష్ట్ర సగటు వర్షపాతంతోనే అన్ని ప్రాంతాల పరిస్థితిని నిర్ణయించలేం. జిల్లాలు, మండలాలవారీగా వర్షపాతం, నీటి నిల్వలు, పంటల పరిస్థితిని పరిశీలించాలి.వర్షాభావం గురించి గణాంకాలు వెల్లడైన తర్వాత ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలేమిటి? నీటి నిల్వలను పెంచేందుకు ఏ పనులు చేపట్టింది? రాబోయే వేసవికి తాగునీటి ప్రణాళిక సిద్ధమైందా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి.

జలాశయాల్లో నిల్వలు.. వాస్తవ పరిస్థితి ఏమిటి? తెలంగాణ నీటిపారుదల నిర్ణయ సహాయక వ్యవస్థ (IDSS) 2026 అక్టోబర్ 22 నాటి గణాంకాల ప్రకారం, రాష్ట్రంలోని 87 జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం 1,059.3 టీఎంసీలు కాగా, అందులో 470.55 టీఎంసీల నీరు నమోదైంది. అంటే మొత్తం సామర్థ్యంలో సుమారు 44.42 శాతం నిల్వ ఉంది.అలాగే, 21,500 చిన్న నీటి పారుదల చెరువుల మొత్తం సామర్థ్యం 253.8 టీఎంసీలు కాగా, అక్టోబర్ 9 నాటికి 93.51 టీఎంసీల నీరు ఉన్నట్లు నమోదైంది. ఇది మొత్తం సామర్థ్యంలో సుమారు 36.85 శాతం. ఈ లెక్కలు ఆందోళనకు కారణమైనా, ప్రతి జలాశయంలో పరిస్థితి ఒకేలా ఉందని భావించరాదు. ప్రాజెక్టులవారీగా నిల్వలు, ఇప్పటికే చేసిన కేటాయింపులు, తాగునీటి అవసరాలు, సాగునీటికి అందుబాటులో ఉన్న పరిమాణాన్ని ప్రభుత్వం వెల్లడించాలి. జలాశయాల్లో నీరు ఉండటం ఒక ఎత్తయితే, అది అవసరమైన ప్రాంతాలకు చేరడం మరో ఎత్తు. కాలువలు, పంపులు, పైప్‌లైన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా అంతే ముఖ్యం.కరువు ప్రభావంపై ముందస్తు చర్యలేవి?

అక్టోబర్ 24న వెలువడిన వార్తా నివేదిక ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం ప్రాథమికంగా 358 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించే ప్రక్రియ చేపట్టింది. 324 మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితి కీలకంగా ఉన్నట్లు ఆ నివేదిక పేర్కొంది. ఇవి ప్రాథమిక అంచనాలే కావడంతో తుది అధికారిక జాబితాను పరిశీలించాలి. కానీ ఇంత విస్తృత స్థాయిలో కరువు ప్రభావంపై అంచనాలు అవసరమవుతున్నప్పుడు ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చోలేదు కదా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, పశువులకు మేత, పంటల సంరక్షణ, ఉపాధి అవసరాలను అంచనా వేసి తక్షణ కార్యాచరణ ప్రకటించాలి. కరువు గుర్తింపు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపశమనం కలిగించాలి.భూగర్భజలాలపై ఒత్తిడి.. రేపటి సమస్యకు నేడే పరిష్కారం కావాలివర్షాలు తగ్గినప్పుడు బోరుబావులపై ఆధారపడటం పెరుగుతుంది. అయితే భూమిలోకి ఇంకే నీటి పరిమాణం తగ్గి, వెలికితీసే నీరు పెరిగితే భూగర్భ జలాలు క్రమంగా లోతుకు వెళ్లే ప్రమాదం ఉంది. దీనివల్ల రైతులకు కొత్త బోర్లు వేయాల్సిన ఖర్చు పెరగడమే కాకుండా, తాగునీటి సరఫరా కూడా దెబ్బతినవచ్చు.

డెక్కన్ క్రానికల్ నివేదిక ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా భూగర్భజలాల సగటు లోతు ఆగస్టు చివర్లో 7.52 మీటర్లుగా ఉండగా, సెప్టెంబర్ చివరికి 11.24 మీటర్లకు చేరింది. ఇది ఆ నివేదికలో నమోదైన రాష్ట్ర సగటు మాత్రమే; ప్రతి ప్రాంతంలో పరిస్థితి భిన్నంగా ఉండవచ్చు.

కొత్త బోర్లు వేయడమే పరిష్కారమనే ఆలోచనకు స్వస్తి పలకాలి. చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, భూగర్భజలాల వినియోగంపై పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటిని తోడే వేగం కంటే భూమిలోకి నీరు చేరే అవకాశాలను పెంచడమే దీర్ఘకాలిక పరిష్కారం.రైతుకు భరోసా మాటల్లో కాదు.. నీటి రూపంలో కావాలినీరు అందకపోతే రైతు పెట్టుబడి ప్రమాదంలో పడుతుంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరించిన తర్వాత పంట కీలక దశలో ఎండిపోతే నష్టం రైతుదే. అందుకే సాగునీటి లభ్యతపై ముందస్తు సమాచారం, స్పష్టమైన విడుదల షెడ్యూళ్లు, పంటల ఎంపికపై సాంకేతిక సలహాలు అవసరం.నీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మసేద్య పద్ధతులు, పంటల సంరక్షణపై వ్యవసాయ శాఖ రైతులకు సహకరించాలి. పంట నష్టం సంభవించినప్పుడు అర్హులైన రైతులకు వర్తించే సహాయ పథకాలను సమర్థంగా అమలు చేయాలి. రైతును ఆదుకోవడం అంటే నష్టపరిహారం ప్రకటించడం మాత్రమే కాదు.. నష్టం సంభవించే అవకాశాలను తగ్గించడం కూడా.ప్రజాధనం ఖర్చయింది.. ప్రజలకు ప్రయోజనం ఎంత?తెలంగాణ ప్రభుత్వ సామాజిక ఆర్థిక నివేదిక 2024లో పొందుపరిచిన నీటి పారుదల శ్వేతపత్రం ప్రకారం, 2014 తర్వాత ప్రధాన, మధ్యతరహా, చిన్న నీటిపారుదల, ఇతర పథకాలపై కలిపి రూ.1,81,067.84 కోట్ల వ్యయం నమోదైంది. అదే నివేదికలో అదనంగా సృష్టించిన సాగునీటి సామర్థ్యాన్ని 15.81 లక్షల ఎకరాలుగా పేర్కొన్నారు.

ఇంతటి ప్రజాధనం ఖర్చయిన తర్వాత ప్రాజెక్టులవారీగా ఎంత భూమికి వాస్తవంగా సాగునీరు అందుతోంది? ఎన్ని పనులు పూర్తయ్యాయి? ఎక్కడ నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి? నీటి పంపిణీ వ్యవస్థల్లో లోపాలేమైనా ఉన్నాయా? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలి.నిధుల కేటాయింపు, వ్యయం, నిర్మాణం, ప్రజలకు అందిన ప్రయోజనం.. ఈ నాలుగు దశల మధ్య స్పష్టమైన సంబంధం ఉండాలి. కాగితాలపై పూర్తయిన పనులు క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇవ్వకపోతే బాధ్యత నిర్ణయించాలి. ప్రాజెక్టు నిర్మాణం లక్ష్యం కాదు.. రైతు పొలానికి నీరు చేరడమే అసలు లక్ష్యం.తాగునీటి భద్రతపై రాజీ వద్దుజలాశయాల నిల్వలు తగ్గుతున్న సమయంలో తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. పట్టణాలు, గ్రామాల అవసరాలను అంచనా వేసి సరఫరా ప్రణాళిక సిద్ధం చేయాలి. పైప్‌లైన్ల లీకేజీలు, పంపుల మరమ్మతులు, నీటి శుద్ధి, ప్రత్యామ్నాయ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.ట్యాంకర్ల ద్వారా నీరు అందించడం అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడవచ్చు. కానీ అదే శాశ్వత పరిష్కారంగా మారకూడదు. ప్రజలకు నీరు ఎప్పుడు సరఫరా చేస్తారు, అంతరాయం ఉంటే ఎవరిని సంప్రదించాలి అనే వివరాలు స్థానిక సంస్థలు తెలియజేయాలి. నీటి నాణ్యతను పరీక్షించాలి. సరఫరాలో అక్రమాలు, వివక్ష, వృథాను అరికట్టాలి.

పాలకులు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా జలాశయాలు, చెరువులు, భూగర్భజలాల తాజా పరిస్థితిపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి. రాబోయే వేసవి వరకు తాగునీటి అవసరాలను అంచనా వేయాలి. సాగునీటి కేటాయింపులు, కరువు ప్రభావిత ప్రాంతాలకు సహాయం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలి.ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు, గడువులు నిర్ణయించాలి. కేటాయించిన నిధులు ఎంత? పనులు ఎక్కడ పూర్తయ్యాయి? ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగింది? అనే వివరాలను అందుబాటులో ఉంచాలి. ప్రకటనలకంటే ఫలితాలకు, సమీక్షల కంటే అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలి.ముగింపు: నీటి ముప్పు రాకముందే మేల్కొనాలి!తెలంగాణకు ఇప్పుడు అవసరమైనది నీటి సంక్షోభంపై రాజకీయ ఆరోపణలు కాదు.. శాస్త్రీయమైన, పారదర్శకమైన, ప్రజాకేంద్రిత కార్యాచరణ. వర్షపాతం లోటును అధిగమించలేకపోయినా, అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించవచ్చు. ప్రకృతిని నియంత్రించలేకపోయినా, నీటి వనరుల నిర్వహణను మెరుగుపరచవచ్చు. వర్షాలు తగ్గినప్పుడు మాత్రమే స్పందించే విధానాన్ని మార్చవచ్చు.నీరు ప్రకృతి ప్రసాదించిన వనరు. దాన్ని కాపాడటం పాలకుల బాధ్యత; పొదుపుగా వినియోగించడం ప్రజల భాగస్వామ్య కర్తవ్యం. రైతు పొలానికి నీరు చేరాలి. ప్రతి ఇంటికి తాగునీరు అందాలి. చెరువులు పునరుజ్జీవం పొందాలి. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులు ఫలితాలు ఇవ్వాలి.తెలంగాణ పాలకులారా.. నీటి ముప్పు ముంచుకొస్తున్నప్పుడు మేల్కొనకపోతే, రేపు ప్రజల దాహం తీర్చడం మరింత కష్టమవుతుంది. హామీలు కాదు.. కార్యాచరణ చూపండి. ప్రకటనలు కాదు.. ఫలితాలు ఇవ్వండి. నీటి భద్రతను ప్రభుత్వ ప్రాధాన్యంగా మార్చండి. ఎందుకంటే నీరు లేకపోతే అభివృద్ధి లేదు.. నీటి భద్రత లేకపోతే భవిష్యత్తుకు భరోసా లేదు.




ఎం రవీందర్
7901503777

# జాతీయం-అంతర్జాతీయం



## హైకోర్టులకు కొత్త సారథులు

- నలుగురు చీఫ్ జస్టిస్‌ల నియామకానికి సుప్రీం కొలీజియం సిఫార్సు

**న్యూఢిల్లీ :**
వివిధ హైకోర్టులకు నలుగురు చీఫ్ జస్టిస్‌లను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని కొలీజియం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ బి.వి. నాగరత్న సభ్యులుగా ఉన్న కొలీజియం అక్టోబర్ 26న సమావేశమై ఈ సిఫార్సులను సూచించింది. తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ పి. సామ్ కోషీని ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించాలని సిఫార్సు చేసింది. గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ మానష్ రంజన్ పాఠక్‌ను అదే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించాలని సూచించింది. అదేవిధంగా, కోల్‌కత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గాను, పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ సుధీర్ సింగ్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించాలని కేంద్రానికి సిఫార్సు చేసింది.

# 60 వేల మంది ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ ఉద్వాసన

**వాషింగ్టన్ :**
ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ ఉద్వాసనలు చేపట్టింది. భారీ స్థాయిలో స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని (బైఅవుట్) ప్రకటించింది. సుమారు 60 వేల మంది ఉద్యోగులకు బైఅవుట్ ఆఫర్ అందించినట్లు సంబంధిత వర్గాలు సోమవారం వెల్లడించాయి. సంస్థ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు నాలుగో వంతు మంది ఈ పథకానికి అర్హులుగా ఉన్నట్లు తెలిపాయి. తొలగింపుల్లో భారత్ ఉద్యోగులు కూడా ఉన్నట్లు సమాచారం. భారత్‌తో పాటు అమెరికా, కెనడా, బ్రిటన్‌లలో పనిచేస్తున్న వైస్ ప్రెసిడెంట్ స్థాయి నుంచి దిగువ స్థాయి ఉద్యోగుల వరకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నాయి. అయితే డేటా సెంటర్లు, విక్రయాలు, మార్కెటింగ్ విభాగాల్లోని కొన్ని ఉద్యోగుల సమూహాలకు మినహాయింపు ఇచ్చినట్లు మైక్రోసాఫ్ట్ ప్రతినిధి వెల్లడించారు. ఉద్యోగులకు తమ భవిష్యత్తును నిర్ణయించుకునే విషయంలో మరింత వెసులుబాటు కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మన్ ఉద్యోగులకు పంపిన మెమోలో పేర్కొన్నారు. మార్పులకు అనుగుణంగా సంస్థ తన విధానాలను అభివృద్ధి చేసుకుంటున్న క్రమంలో స్వచ్ఛంద నిష్క్రమణ పథకం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ అమెరికాలోని తమ ఉద్యోగుల్లో సుమారు ఏడు శాతం మందికి ముందస్తు పదవీ విరమణ అవకాశాన్ని మైక్రోసాఫ్ట్ కల్పించినట్లు సమాచారం. అప్పుడు అర్హత పొందిన వారిలో దాదాపు 30 శాతం మంది ఈ ఆఫర్‌ను స్వీకరించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి.




ఈ ఏడాది జూన్ చివరి నాటికి ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌లో 2,23,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని నివేదిక తెలిపింది. 2025 చివరి నాటికి ఈ సంఖ్య 2,28,000గా ఉంది. ప్రస్తుతం ప్రకటించిన బైఅవుట్ పథకానికి సంస్థ ఉద్యోగుల్లో సుమారు 27 శాతం మంది అర్హులుగా ఉన్నట్లు సమాచారం.

**ఎఐ పెట్టుబడులు.. ఉద్యోగాల కోతలు**
ఎఐ సాంకేతికతపై ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాలు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో, ఉద్యోగాలపై దాని ప్రభావం గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎఐ అభివృద్ధి, వినియోగం పెరుగుతున్న కొద్దీ పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ వంటి ప్రముఖులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు పలు ప్రముఖ సంస్థలు ఉద్యోగాల కోతలను ప్రకటిస్తున్నాయి. నెట్‌ఫ్లిక్స్ తన ఉద్యోగుల్లో సుమారు ఆరు శాతం మందిని, అంటే సుమారు వెయ్యి మందిని తొలగించనున్నట్లు గత వారం అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఈబే ఈ నెల ప్రారంభంలో వెయ్యి మంది ఉద్యోగులను తొలగించింది. ఈ ఏడాది ప్రారంభంలో 800 ఉద్యోగాలపై ప్రభావం చూపిన కోతలకు ఇది అదనం. మే నెలలో మెటా తన ప్రపంచవ్యాప్త ఉద్యోగుల్లో సుమారు 10 శాతం మందిని తొలగించడంతో దాదాపు 8,000 మంది ప్రభావితమయ్యారు. అంతకుముందు ఏప్రిల్‌లో అదనంగా 6,000 మందిని నియమించుకునే ప్రణాళికలను రద్దు చేసుకుంటున్నట్లు, మరో 7,000 మంది ఉద్యోగులను ఎఐ ఆధారిత పని విధానాలకు సంబంధించిన బాధ్యతల్లోకి మార్చనున్నట్లు ప్రకటించింది. ఉబర్ సంస్థ సెప్టెంబర్‌లో తన సిబ్బందిలో సుమారు 10 శాతం మందిని తొలగించే ప్రణాళికను ప్రకటించింది. దీంతో 3,000 మందికి పైగా ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనాలు వెలువడ్డాయి. మరోవైపు, ఈ ఏడాది జనవరిలో అమెజాన్ ప్రపంచవ్యాప్తంగా 16,000 ఉద్యోగాల కోతను ప్రకటించింది.

## రఘురామ కృష్ణరాజుకు 'సుప్రీం'లో చుక్కెదురు



- రూ.237.84 కోట్ల బ్యాంకు రుణాల కేసులో ఎఫ్‌ఐఆర్ రద్దుకు నిరాకరణ

**న్యూఢిల్లీ :**
ఉండి ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజుకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. రూ.237.84 కోట్ల బ్యాంకు రుణాల వ్యవహారంలో తనపై నమోదైన సిబిఐ ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో దర్యాప్తును కొనసాగించేందుకు సిబిఐకి మార్గం సుగమమైంది. రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగుతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఆర్థిక నేరాల కేసులో దర్యాప్తు సాగుతున్న దశలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. దర్యాప్తు అధికారి 16 వారాల్లోగా విచారణ పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయాలన్న ఆదేశాలను యథాతథంగా కొనసాగించింది. ఇండ్ భారత్ పవర్ జెన్‌కామ్ లిమిటెడ్ పేరుతో విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో పాటు వ్యాపార అవసరాల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ.237.84 కోట్ల రుణాలు తీసుకున్నట్లు కేసు వివరాలు పేర్కొంటున్నాయి. ఈ నిధులను నిర్దేశిత ప్రాజెక్టులకు వినియోగించకుండా, నకిలీ కొనుగోలు పత్రాలు, తప్పుడు ఖాతాలతో గ్రూప్ కంపెనీలకు మళ్లించారని బ్యాంకులు ఫిర్యాదు చేశాయి. ఈ ఆరోపణలపై సిబిఐ.. రఘురామ కృష్ణరాజుతోపాటు కంపెనీకి చెందిన ఇతర డైరెక్టర్లపై కేసులు నమోదు చేసింది. కుట్ర, మోసం, ఫోర్జరీ, నకిలీ పత్రాల వినియోగం వంటి అభియోగాలతోపాటు అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసులు నమోదయ్యాయి. రఘురామ కృష్ణరాజుతోపాటు ఇండ్ భారత్ పవర్ జెన్‌కామ్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు కనుమూరు ఇందిరా ప్రియదర్శిని, రమాదేవి, దుంపల మధుసూదన రెడ్డి, అంబేద్కర్ రాజ్‌కుమార్ గంటా, నారాయణ ప్రసాద్ తదితరులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లను కూడా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది.

# లూలా జయభేరి..

- బ్రెజిల్ అధ్యక్షునిగా నాలుగోసారి ఎన్నిక
- ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రజాభాగస్వామ్యాన్ని పెంచుతానని వెల్లడి
- లాటిన్ అమెరికాలో మితవాదానికి ఎదురుదెబ్బ



**రియో డి జనీరో/న్యూఢిల్లీ:**
బ్రెజిల్ ప్రజానీకం కొత్త చరిత్ర సృష్టించారు. తమ దేశంపై పెత్తనం చేయడానికి సామ్రాజ్యవాదం పన్నిన కుట్రలను, కార్పొరేట్ల కట్టు కథలను తిరస్కరించారు. వారికి అండగా నిలిచి బ్రెజిల్‌ను దోపిడి శక్తుల పెరటి తోటగా మార్చడానికి అనునిత్యం ప్రయత్నించిన మితవాద శక్తులను తోసిపుచ్చారు. బ్రెజిల్ ప్రజల స్వేచ్ఛకు, స్వాతంత్య్రానికి, అభివృద్ధికి ప్రతిన చేసిన వామ పక్ష నేత లూలా వైపు నిలిచారు. సోమవారం నాడు వెలువడిన అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో లూలా జయభేరి మోగించారు! బ్రెజిల్ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరికీ రానన్ని ఓట్లు లూలాకు దక్కాయి. కార్పొరేట్, సామ్రాజ్యవాద, మితవాద రాజకీయాలపై అక్కడి ప్రజలు చేసిన తిరుగుబాటుకు, వామపక్షం తప్ప మరేది భవితకు భరోసా ఇవ్వదన్న వాస్తవానికి లూలా విజయం ఒక నిదర్శనం. ఈ ఎన్నికల్లో లూలాకు 51.76శాతం ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి ఫ్లావియో బొల్సోనరా 48.24 శాతం ఓట్లు సాధించారు. ఆయన ఓటమే లక్ష్యంగా అమెరికా ఈ ఎన్నికలలో ఎన్నో కుట్రలకు దిగింది. సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ లూలాకు వ్యతిరేకంగా విషంకక్కారు. అయినా, బ్రెజిల్ ప్రజానీకం యావత్తు లూలా వెంట నిలిచింది! యువత స్వచ్ఛందంగా కదలింది. 'లూలా సైన్యం' పేరుతో సోషల్ మీడియాలో బ్రెజిల్ పరిరక్షణకు కదం తొక్కి కొత్త భవిష్యత్తును ఆవిష్కరించింది. బ్రెజిల్ ప్రజలు అందించిన ఈ విజయం ఆ దేశ సరిహద్దులకే పరిమితం కాదు. లాటిన్ అమెరికాలో మితవాద శక్తులకు ఈ విజయం గట్టి ఎదురుదెబ్బ! సమానత్వం, సోషలిజం, సామాజిక న్యాయం, కార్మికుల హక్కులు, పేదల సంక్షేమం కోసం పోరాడుతున్న ప్రపంచవ్యాప్త వామ పక్ష శ్రేణులకు ఈ విజయం కొత్త ఆశల పతాకం! పోరాట పథంలో ముందుకు సాగేందుకు స్ఫూర్తినిచ్చే విజయ నాదం!

**ప్రజాస్వామ్య విజయం : సిపిఎం**
లూలా విజయాన్ని సిపిఎం స్వాగతించింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో 'ట్రంప్ మద్దతున్న ఫ్లావియో బోల్సనారో విభజనవాద, తీవ్రవాద విధానాలను బ్రెజిల్ ప్రజలు తిరస్కరించారని తెలిపింది. ఇది ప్రజాస్వామ్య విజయమని, మితవాద రాజకీయాలకు పతనం తప్పదనడానికి ఈ గెలుపు నిదర్శనం' అని వ్యాఖ్యానించింది. లూలా నాలుగో పర్యాయం గెలవడం చారిత్రాత్మకమని సిపిఎం పేర్కొంది.



## ఒలెష్కీలో ఆగిన తుపాకుల మోత

**మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వంతో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య కాల్పుల విరమణ!**

**రష్యా-ఉక్రెయిన్:**
రష్యాఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లకుపైగా జరుగుతోన్న యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా ఆక్రమణలో ఉన్న ఉక్రెయిన్‌కు చెందిన ఒలెష్కీ నగరం) లో మంగళవారం తెల్లవారుజామునుంచి కాల్పుల విరమణ ప్రారంభమైంది. ఈ సీజ్‌ఫైర్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సతీమణి మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వం వహించడం గమనార్హం. 2022లో రష్యాఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. అప్పుడే ఉక్రెయిన్‌కు చెందిన ఖేర్సన్ ప్రాంతాన్ని రష్యా తన అధీనంలోకి తీసుకుంది. ఒలెష్కీ నగరం ఈ ఖేర్సన్ ప్రాంతంలోనిదే. యుద్ధం కారణంగా ఆ నగరం తీవ్ర మానవతా సంక్షోభం ఎదుర్కొంటోంది. సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశాల సమయంలో ఒలెష్కీ పరిస్థితిపై ఇరు దేశాలకు చెందిన ప్రతినిధులతో మెలానియా సంప్రదింపులు జరిపారు. ఆ చర్చలు విజయవంతమైనట్లు గతవారం వైట్‌హౌస్ ప్రకటించింది.యుద్ధం కారణంగా ఒలెష్కీ నుంచి పలువురు ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. అక్కడ మిగిలిన వృద్ధులు, పిల్లలు ఆహారం, మంచినీరు, మందుల కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.
ఈ సంధితో సహాయకబృందాలు ఆ నగరంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుంది. మానవతా సహాయం అందనుంది.
యుద్ధ ప్రాంతం నుంచి బయటపడాలనుకునే పౌరుల కోసం సురక్షిత మార్గాలు ఏర్పాటయ్యాయి. వారు ప్రయాణించే నిర్ణీత మార్గాల్లో మైన్లను తొలగించే పనులు జరుగుతున్నాయి.

# విజయ్ ప్రభుత్వంపై ఎంకే స్టాలిన్ వ్యంగ్యాస్త్రాలు!



**తమిళనాడు :**
లో విజయ్ (CM Vijay) ప్రభుత్వానికి వరుసగా చిక్కులు ఎదురవుతున్నాయి. ఇటీవలే ఆ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు డ్రగ్స్ అక్రమ రవాణా చేస్తూ పట్టుపడగా.. ఇప్పుడు తేనిలోని జైలు నుంచి ఖైదీలు పారిపోయారు. వీటిపై మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శనాస్త్రాలు సంధించారు. మొన్న 'బ్రేకింగ్ బ్యాడ్'.. ఇప్పుడు 'ప్రిజన్ బ్రేక్' అంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ప్రముఖ వెబ్ సిరీస్‌ల పేర్లతో రాష్ట్రంలోని శాంతి భద్రతలను పోల్చడం గమనార్హం. ''తమిళనాడులో 'బ్రేకింగ్ బ్యాడ్' తర్వాత 'ప్రిజన్ బ్రేక్' మొదలైంది. బెయిల్‌పై బయట ఉన్న నేరస్థులనే పర్యవేక్షించడం లేదనుకున్నాను. జైలులో ఉన్న ఖైదీలు తప్పించుకుంటున్నా ఈ ప్రభుత్వం చూస్తూ కూర్చుంటోంది. ఇప్పటికే పుళల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు తప్పించుకున్న ఘటన మరవకముందే.. ఇప్పుడు తేని జైలు నుంచి 17 మంది పారిపోయారు. 1995 తర్వాత ఒకేసారి ఇంతమంది ఖైదీలు పారిపోవడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. భద్రతా ఏర్పాట్లు, మెరుగైన సాంకేతికత ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. బయట ఉన్న నేరగాళ్లు స్వేచ్ఛగా నేరాలు చేస్తున్నారు.
లోపల ఉన్న ఖైదీలు ధైర్యంగా తప్పించుకుంటున్నారు. మొత్తం మీద ఎవరికీ ఉపయోగపడని ప్రభుత్వం మనది. వారు ప్రజలను రక్షించరు. ప్రజలే తమను తాము కాపాడుకోవాల్సిన పరిస్థితికి తమిళనాడు చేరింది'' అని ఎక్స్‌లో స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు.రూ.100 కోట్ల విలువైన 135 కిలోల డ్రగ్స్ అక్రమ రవాణా చేసిన కేసులో ఇటీవల నాగపట్టణానికి చెందిన టీవీకే నేత ఒకరు అరెస్టయ్యారు. దానిపై స్టాలిన్ తీవ్ర విమర్శలు చేశారు. బ్రేకింగ్ బ్యాడ్ అనే వెబ్‌సిరీస్ (డ్రగ్స్ తయారీ ఆధారంగా తీసిన సిరీస్)ను ప్రస్తావిస్తూ.. టీవీకే 'బ్యాడ్ పార్టీ' మాత్రమే కాదని, 'బ్రేకింగ్ బ్యాడ్ పార్టీ' అని వ్యాఖ్యలు చేశారు.
తాజాగా తన పోస్టులో దీనితోపాటు మరో వెబ్ సిరీస్ 'ప్రిజన్ బ్రేక్' పదాన్ని ప్రస్తావించారు.

## దాడులు ఆపితే రూ.9,500 కోట్లు ఇస్తాం

**హూతీలకు సౌదీ సంచలన ఆఫర్!**



***రియాద్/టెహ్రాన్***
సౌదీ అరేబియాహూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులతో పశ్చిమాసియాలో ఘర్షణలు మరోస్థాయికి వెళ్లాయి. సౌదీలోని మౌలిక సదుపాయాలు, చమురు క్షేత్రాలను డ్రోన్లు, క్షిపణులతో టార్గెట్ చేస్తుండడంతో సంపన్న దేశం తీవ్ర ఆర్థిక, ప్రాణ నష్టాలను చవిచూస్తోంది. హర్మూజ్‌లో ట్యాంకర్లపై ఇరాన్ చేస్తున్న దాడుల వల్ల గల్ఫ్ దేశాల నుంచి చమురు ఎగుమతులకు కూడా అంతరాయం కలుగుతోంది. దేశంలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై దాడులు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఎట్టకేలకు హూతీలతో రాజీకొచ్చారు. కాల్పుల విరమణ కోసం ఇరాన్ మధ్యవర్తిత్వంతో తిరుగుబాటుదారులకు ఓ ఆఫర్ ఇచ్చారు.హూతీలు తమ దేశంపై దాడులను పూర్తిగా ఆపితే 1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9,500 కోట్లు) ఇస్తామని సౌదీ యువరాజు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మొత్తాన్ని ఇరాన్ ద్వారానే హూతీలకు అందించే అవకాశం ఉంది. ఈ మేరకు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఒప్పందం కోసమే ఇటీవల సౌదీ ) రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్ టెహ్రాన్‌కు వెళ్లారు. ఆయన వచ్చిన సైనిక రవాణా విమానంలోనే.. హూతీలకు ఇవ్వదలిచిన మొత్తం డబ్బును తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని సౌదీ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. ఇరాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన శాంతి చర్చల్లో తుర్కియే ఇంటెలిజెన్స్ చీఫ్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, ఐఆర్‌జీసీ సీనియర్ అధికారులు పాల్గొన్నట్లు సమాచారం. దేశంలోని విమానాశ్రయాలు, చమురు కేంద్రాలపై దాడులు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఎట్టకేలకు హూతీలతో రాజీకొచ్చారు.బ్రహ్మపుత్రపై డ్యాం ప్రమాదకరం.. చైనాకు నిపుణుల హెచ్చరికగతంలో హూతీలు యెమెన్ ప్రభుత్వంతో పోరాడుతున్న తరుణంలో వీరికి వ్యతిరేకంగా సౌదీ అరేబియా ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. ఇక అప్పటి నుంచి వీరి మధ్య ప్రత్యక్ష పోరు జరుగుతోంది. ఈ క్రమంలోనే సౌదీ వారితో ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందుకు వచ్చింది.

## పినరయి విజయన్ ఎఫ్‌ఐఆర్‌పై కేరళం హైకోర్టు స్టే



**కొచ్చి :**
సిఎంఆర్‌ఎల్ ఎక్సాలాజిక్ లంచం కేసులో కేరళం ప్రతిపక్ష నేత పినరయి విజయన్, ఆయన కుటుంబ సభ్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు ఉత్తర్వులపై రాష్ట్ర హైకోర్టు సోమవారం స్టే విధించింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కూడా హైకోర్టు నిలిపివేసింది. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా విజయన్, ఆయన కుమార్తె టి. వీణ, అల్లుడు, మాజీ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్ దాఖలు చేసిన అప్పీళ్లను జస్టిస్ కె. నటరాజన్, జాన్సన్ జాన్‌లతో కూడిన హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణకు స్వీకరించింది. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలన్న ఉత్తర్వుపై స్టే విధించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ కేసును ఇడి దర్యాప్తు చేస్తోంది. సింగిల్ బెంచ్ ఉత్తర్వుకు వ్యతిరేకంగా విజయన్, ఆయన బంధువులు ముందుగా సుప్రీంకోర్టును ఆశ్రయించగా, పునఃపరిశీలన కోసం కేసును డివిజన్ బెంచ్‌కు తిరిగి పంపిన సంగతి తెలిసిందే. తమ వాదన వినకుండానే సింగిల్ జడ్జి ఎఫ్‌ఐఆర్ నమోదుకు ఆదేశించారని విజయన్ చేసిన వాదనను సుప్రీంకోర్టు సమర్థించింది.

# రామ్‌హిత్' పేరు మార్పు వివాదం

## నోరుజారి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవ్వడంతో క్షమాపణలు చెప్పిన యూపీ సీఈఓ!

**ఉత్తర్‌ప్రదేశ్ :**
ఓటరు స్లిప్‌లో తప్పుగా ముద్రితమైన పేరు గురించి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆయన ప్రయోగించిన పదజాలం మర్యాదకరంగా లేదంటూ నెట్టింట ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో యూపీ సీఈఓ క్షమాపణలు చెప్పారు. అసలేం జరిగిందంటే..?
ఉత్తర్‌ప్రదేశ్ )లో ఇటీవల శాసనమండలి ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పంపిణీ చేసిన ఓటరు స్లిప్ లో తీవ్రమైన తప్పు దొర్లింది. 'రామ్‌హిత్ యాదవ్ ' అనే వ్యక్తి పేరును హిందీలోకి మార్చినప్పుడు 'రామ్ నే యాదవ్ కో మారా (రామ్ యాదవ్‌ను చంపెను)' అని ముద్రితమైంది. ఈ ఓటరు స్లిప్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం తీరుపై విమర్శలు గుప్పించారు. ''జ్ఞానేశ్ కుమార్ జీ.. రామ్ ఎందుకు యాదవ్‌ను మాత్రమే చంపాడు. సింగ్, శర్మ, రాయ్, బిష్త్‌ను ఎందుకు చంపలేదు?మీ కంప్యూటర్‌కు ఏమైనా కుల వివక్ష ఉందా ?మీరు ఏదైనా రాజకీయ పార్టీ అజెండాను నడుపుతున్నారా?'' అని ఎంపీ ప్రశ్నించారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ క్రమంలోనే సంజయ్ సింగ్ పోస్ట్‌కు యూపీ ముఖ్య ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా స్పందిస్తూ కాస్త వ్యంగ్యంగా బదులిచ్చారు. ''కంప్యూటర్లు/సాఫ్ట్‌వేర్‌లకు ఎలాంటి కులవివక్ష ఉండదు. అవును, ఆ పేరు విషయంలో మా వైపు తప్పు జరిగింది. అయితే, అదృష్టశాత్తూ.. ఆ తప్పులోనూ కులపరమైన వివక్ష ఏదీ చోటుచేసుకోలేదు. ఇంకానయం.. రామ్ ఏ మైనార్టీ వ్యక్తిని చంపలేదు. లేదంటే మతవివక్ష నింద కూడా మాపై పడేది'' అని యూపీ సీఈఓ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఎన్నికల అధికారి స్పందనపై నెట్టింట తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఆయన రాజకీయ భావజాలంతో మాట్లాడుతున్నారని పలువురు దుయ్యబట్టారు.ఇది వివాదాస్పదం కావడంతో నవదీప్ రిన్వా నేడు స్పందిస్తూ క్షమాపణలు తెలియజేశారు. ''అధికారిక ఛానళ్ల నుంచి వచ్చే స్పందనల్లో ఇలాంటి భాష, దాని తీవ్రత సరైంది కాదని అర్థమైంది. ఆ వ్యాఖ్యలపై నెట్టింట వ్యక్తమైన ఆగ్రహాన్ని మేం గుర్తించాం. ఆ స్పందన పట్ల ఎవరైనా మనస్తాపానికి గురైతే మనస్ఫూర్తిగా క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఇక నుంచి మా నుంచి మర్యాదపూర్వక, అధికారిక స్పందనలే వస్తాయి'' అని ఆయన వివరణ ఇచ్చారు.



## వందేమాతరం పిటిషన్లపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ :**
వందేమాతరం ఆరు చరణాలను పాడాల్సిందేనన్న ఉత్తర్వులను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు కేంద్రం స్పందన కోరింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఆరు చరణాల వందేమాతరం గీతాన్ని 'విభజనవాద మత యుద్ధ గీతం'గా, మతపాలన వైపు ఒక అడుగుగా బి.డి.బోర్కర్, మాజీ ఐఎఎస్ అధికారి బాలకృష్ణన్ సత్యభామ మావోజీ తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు నిర్దిష్ట మతానికి చెందిన నిర్దిష్ట దేవతలకు చేసే మతపరమైన ప్రార్థనను జాతీయ గీతంగా విధించాయని, ఇది మత ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి, క్రిమినల్ చట్టాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. జనవరి 28, జూలై 9 తేదీలలో వరుసగా జారీ చేసిన రెండు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా వ్యక్తమైన ప్రభుత్వ నిర్బంధం, "మైనారిటీ వర్గాల మత, ఆధ్యాత్మిక భావాలను దెబ్బతీయడం ద్వారా దేశంలో మత విద్వేషాలను తీవ్రతరం చేసే పరిణామాలకు దారితీస్తుందని పిటిషన్ల తరపున న్యాయవాది మోహన్ గోపాల్ పేర్కొన్నారు. బంకిం చంద్ర చటర్జీ తన 'ఆనందమఠ్' నవలలో రాసిన ఆరు చరణాల రూపం, ఒక ఆధిపత్య వర్గం ఆధిక్యతను పెంచడం ద్వారా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని, సంఘర్షణను ప్రోత్సహిస్తుందని బోర్కర్ వాదించారు. ఐక్యత, సామరస్యం స్వరూపం శాశ్వతంగా దెబ్బతింటుందని ఆయన అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన ప్పటి నుండి ఈ ఏడాది ఉత్తర్వులు జారీ అయ్యే వరకు సుమారు 79 ఏళ్ల పాటు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు, ఇతర సమూహాలు ఆనంద్‌మఠ్‌లోలేని రెండు చరణాలను మాత్రమే ఆలపించారని పేర్కొన్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## భూ రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి జిల్లాఅక్టోబర్27 (వుదయం ప్రతినిధి):**

మంగళవారం బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పురోగతిపై తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి రీసర్వే నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులు, ప్రజలతో మాట్లాడి భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో పాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని వివరించారు. రీసర్వే పనులను మరింత కచ్చితత్వంతో నిర్వహించలన్నారు.రీసర్వే బృందాలకు గ్రామస్థులు, రైతులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయింపు



**మార్చి 31, 2027 వరకు వన్ టైమ్ సెటిల్మెంట్ పొడిగింపు**
**జిల్లా కలెక్టర్, డీసీసీబీ పిఐసి అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్**
**హనుమకొండ, అక్టోబర్ 27 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మహాజనసభ సమావేశం హనుమకొండ జిల్లా కలెక్టర్, డీసీసీబీ పర్సన్ఇన్‌ఛార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి డీసీసీబీ రూ.10.23 కోట్ల నికర లాభాన్ని సాధించిందని, సభ్య పీఏసీఎస్ లకు రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రగతి పథంలో పయనిస్తున్న బ్యాంకు సేవలను మరింత విస్తరింపజేసేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పంట రుణాలు ప్రతి సొసైటీకి కొత్తగా రూ.10 లక్షల చొప్పున పంట రుణాలు కేటాయింపు.
దీర్ఘకాలిక రుణాలు 50% కంటే ఎక్కువ రికవరీ సాధించిన సొసైటీలకు రూ.50 లక్షల వరకు, A, B కేటగిరీ ఆడిట్ ర్యాంకింగ్ సొసైటీలకు రూ.30 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాల సదుపాయం.
రుణ బకాయిదారులకు ఊరట కలిగిస్తూ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని 31 మార్చి 2027 వరకు పొడిగింపు. భూపాలపల్లి, ములుగు, ఘనపూర్ డీసీసీబీ శాఖల నూతన భవన నిర్మాణాలకు స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తి.
ప్రమాదవశాత్తు మృతి చెందిన గూడూరు బ్రాంచ్ కస్టమర్ కంచె సునీల్ కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహార చెక్కు అందజేత.
సహకార సంఘాల ఆర్థిక బలోపేతం, రైతులు, సభ్యులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీసీసీబీ సీఈఓ మహ్మద్ వజీర్ సుల్తాన్, నాబార్డ్ డిడిఎం చంద్రశేఖర్, జిల్లా సహకార శాఖాధికారులు, బ్యాంకు అధికారులు, పీఏసీఎస్ అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రస్తుత పంటను అన్ని విధాలా కాపాడాలి యాసంగిలో వరి సాగు చేయవద్దు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు**
***నీటి సంరక్షణ పనులు విస్తృతంగా చేపట్టాలి**
**ఖమ్మం, వుదయం బ్యూరో అక్టోబర్ -27:**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.
మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారుదల, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భ జలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరువు పరిస్థితులు, మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు.
ప్రస్తుతం రైతులు ఎంతో కష్టపడి సాగు చేస్తున్న వానాకాలం పంటను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

**యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం:**
రాబోయే యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తెలిపారు.
ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.
రెండవ పంటకు సంబంధించి స్థానిక పరిస్థితులను బట్టి తక్కువ నీటితో పండే పంటలకు తడులు అందించే అవకాశాలను పరిశీలించాలని అన్నారు.

**త్రాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం:**
ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.
పాలేరు రిజర్వాయర్ మూడు జిల్లాల త్రాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా నీటి నిల్వలను సమర్థంగా నిర్వహించాలని అన్నారు.
అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ ఏడాది నీటి ఆవిరి నష్టాలు, ఇంకుడు నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.
త్రాగునీటిని వాహనాల శుభ్రత, తోటల పెంపకం వంటి అవసరాలకు వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

**పాత త్రాగునీటి పథకాల పునరుద్ధరణకు చర్యలు:**
మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడేలా గ్రామాల్లో పాత త్రాగునీటి సరఫరా పథకాలను పునరుద్ధరించాలని ఆదేశించారు.

**నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలి:**
ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

**పత్తి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి:**
పత్తి, ధాన్యం కొనుగోళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. మార్కెట్‌లో పంటలకు లభిస్తున్న ధరల ప్రయోజనం రైతులకు అందేలా చూడాలని, ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్, సిండికేట్లు ఏర్పడకుండా మార్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలి:**
విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని మంత్రి సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాలపై రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, మోటార్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు.

**పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ:**
ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలు, గురుకులాల్లోని పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు.
1986లో సుమారు 600 గ్రామాలు వరదల కారణంగా ముంపునకు గురైన సమయంలో ప్రజలకు ఆహారం, త్రాగునీరు అందించి అధికారులు సమర్థంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు
ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర కరువు, 7 మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని వివరించారు.
కామేపల్లి, మధిర, ఏన్కూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెం మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని, ఆయా ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. .
రాబోయే యాసంగి సీజన్‌కు సాగునీరు అందుబాటులో లేదని, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. మధిర, ఏన్కూరు తదితర నాలుగు మండలాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు సుమారు 3.5 మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో తప్పులు దొర్లకుండా నిర్వహించాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి):**

సూర్యాపేట జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి, డివిజనల్ స్థాయి అధికారులు, ఛార్జ్ ఆఫీసర్లు (తహసీల్దార్లు), అదనపు ఛార్జ్ ఆఫీసర్లు (ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు)కు రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. జనగణన రెండో దశ షెడ్యూల్: 2027 జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తామన్నారు. స్వీయ గణన :జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రత్యక్ష గణన :జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇళ్లు లేని వారి గణన: ఫిబ్రవరి 28 రాత్రి రివిజనల్ రౌండ్: మార్చి 1 నుంచి మార్చి 5 వరకు జనగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ప్రతి గృహాన్ని సందర్శించి 40 రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారని, ప్రజలు సరైన సమాధానాలు తెలిపి ఎన్యుమరేటర్లకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, సీపీఓ కిషన్, జడ్పీ సీఈవో శిరీష, ఆర్డీవోలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, ట్రైనర్లు ఓబులాల్, జంగయ్య పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన యువత



**రక్తదాన శిబిరంలో 101 యూనిట్ల రక్తం సేకరణ**
**ప్రాణత్యాగం చేసిన పోలీసులకు 'రక్తదాన' నివాళి..**
**హనుమకొండ సిటీ, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి) :**

సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి జ్ఞాపకార్థం రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పేర్కొన్నారు. 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం 2026' పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన భారీ రక్తదాన శిబిరం ఘనంగా విజయవంతమైంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత గారు స్వయంగా రక్తదానం చేసి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. అమరవీరుల త్యాగాలను కేవలం మాటలతో స్మరించుకోవడమే కాకుండా, ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసేలా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. సీపీ ఎన్. శ్వేతతో పాటు ఏసీపీ నరసింహారావు, సుబేదారి సీఐ రంజిత్ కుమార్, ఎస్ఐ పాణి ఆదేశాలు, సూచనల మేరకు మామిండ్ల సురేష్ ఆధ్వర్యంలో యువత విశేషంగా పాల్గొంది. సుమారు 15 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. విపత్తుల్లో, అత్యవసర సమయాల్లో ప్రాణాపాయంలో ఉన్న రోగులకు ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. రక్తదాన శిబిరాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ స్వచ్ఛందంగా పాల్గొన్న యువకులకు పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఖచ్చితమైన గణాంకాలే సమర్థవంతమైన అభివృద్ధికి పునాది



**జనగణన–2027 రెండో దశపై అధికారులకు శిక్షణ.**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**
**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి 27.**

జనగణన-2027లో సేకరించే ఖచ్చితమైన గణాంకాలు దేశ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలకు కీలక ఆధారంగా నిలుస్తాయని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జనగణనలో సమాచార సేకరణ ఖచ్చితత్వం, పారదర్శకతకు అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా రెండో దశ జనాభా గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) నిర్వహణపై జిల్లా, సబ్ డిస్ట్రిక్ట్, ఛార్జ్ స్థాయి అధికారులకు అక్టోబర్ 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జనగణన ప్రాముఖ్యత, గణన నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాచార నమోదు విధానం, అధికారుల బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి సేకరించే సమాచారం ఖచ్చితంగా, నిష్పక్షపాతంగా ఉండేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జనగణన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని క్షేత్రస్థాయిలో గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన జిల్లా సెన్సస్ ఆపరేషన్స్ విభాగం ఎస్‌వో, శిక్షణ అధికారి సతీష్ అధికారులకు శిక్షణ అందించారు. జనాభా గణన ప్రక్రియ, సమాచార నమోదు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సందేహాల నివృత్తి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎల్. కిషోర్ కుమార్ (రెవెన్యూ), వై.వి. గణేష్ (లోకల్ బాడీస్), జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ముఖ్య ప్రణాళిక అధికారి పి. చంద్రకళ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎస్‌వో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి



**31వ డివిజన్ ఎమ్మెల్సీ ఇన్‌ఛార్జ్ మామిండ్ల సురేష్**
**పట్టభద్రుల ఓటరు నమోదులో చురుగ్గా పాల్గొన్న 31వ డివిజన్ కాంగ్రెస్ శ్రేణులు**
**హనుమకొండ టౌన్, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి) :**

పశ్చిమ నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాం రెడ్డి ఆదేశాల మేరకు 31వ డివిజన్‌లో పట్టభద్రుల (MLC) ఓటరు నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ముమ్మరంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా 31వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సత్తు రమేష్, డివిజన్ MLC ఇన్‌ఛార్జ్ మామిండ్ల సురేష్ ప్రచారం నిర్వహిస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగనమైన బాబురావు, మంద సునీల్, వెల్దండి రాజేష్, బొల్లెన పున్నం చందర్, కోరిగొప్పల సంజయ్, మేరుగు శ్రవణ్, కూర కాంతి, సట్ల శ్రీకాంత్, దద్దు రాజకుమార్, మామిడాల సంతోష్, మాచర్ల అనిల్ తో పాటు సీనియర్ నాయకులు, బూత్ ఇన్‌ఛార్జులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**
**నల్లగొండ, జిల్లా అక్టోబరు 2(వుదయం ):**

నల్గొండ పట్టణ కేంద్రంలో దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 154 మంది, తెలంగాణలో నలుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు, ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని చెప్పారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం, విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన కల్పించడమే సంస్మరణ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు.
జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎన్‌జీ కళాశాల, రామగిరి, క్లాక్‌టవర్ మీదుగా కొనసాగింది. పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, 12వ బెటాలియన్ అదనపు కమాండెంట్ నాగేశ్వరరావు, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖకు చెందిన ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



*** జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
*** జిల్లా కలెక్టరేట్ లో ఎక్సైజ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం**
**హనుమకొండ, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి) :**

ప్రజావాణి కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎక్సైజ్ శాఖ అధికారులతో వారి కార్యకలాపాల పైన కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు, జిల్లాలో అక్రమ మద్యంపై ఇప్పటి వరకూ నమోదు చేసిన కేసులు, బెల్ట్ షాపుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 27 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ట్రైనీ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నీలోఫర్ అజ్మీ, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



**శాయంపేట, దామెర, సిద్ధాపూర్ పిహెచ్ సి లను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ**
**సమయపాలన పాటించాలి..**
**నాణ్యమైన వైద్యం అందించాలి – డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ**
**హనుమకొండ, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి) :**

ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ అప్పయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన శాయంపేట, దామెర, సిద్ధాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవలు మరియు రికార్డులను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలైన తల్లిశిశు సేవలు అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, టీబీ ముక్త్ భారత్, కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు సర్వేలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి లార్వా జనిత వ్యాధుల నివారణకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో 'డ్రై డే' కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డాక్టర్ ఎన్. సాయికృష్ణ, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీపాల్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అర్నబ్ తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



**ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**
**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 27.**

అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదికల ఆధారంగా వరంగల్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు జాగ్రత్త చర్యలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘాజిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేలా సహాయక, పునరావాస ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలి. జిల్లా అగ్నిమాపక అధికారి, మామునూరులోని నాలుగో బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ తమ బృందాలను, అవసరమైన పరికరాలను తక్షణ సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకుంటూ అవసరమైన చర్యలను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 3424, ఫోన్ నంబర్ 9154252936 ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.ప్రజలు వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించే జాగ్రత్తలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి



**అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదును నిర్లక్ష్యం చేయవద్దు**
**ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపు**
**భద్రాచలం ,అక్టోబర్ 27( వుదయం ప్రతినిధి):**

భద్రాచలం పట్టణంలోని గ్రంథాలయాన్ని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియపై గ్రంథాలయానికి వచ్చిన పట్టభద్రులతో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అర్హత ఉన్నప్పటికీ చాలామంది పట్టభద్రులు ఓటరు నమోదుపై తగిన శ్రద్ధ చూపకపోవడం వల్ల తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించి, అవసరమైన ధ్రువపత్రాలతో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువ పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రక్రియపై అవగాహన పెంచుకోవడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తుల్లో డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన వారిని కూడా ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి వచ్చిన పట్టభద్రులకు ఓటరు నమోదు ఆవశ్యకతను వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి అర్హుడైన పట్టభద్రుడి బాధ్యత అని, ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన

### ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



**జగిత్యాల అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి)**

వెలమ సంక్షేమ మండలి జగిత్యాల ఆధ్వర్యంలో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జగిత్యాల పద్మనాయక ఫంక్షన్ హాల్ లో ప్రారంభించిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సురేందర్ రావు కేడీసీసీ జిల్లా సభ్యులు రామచందర్ రావు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు సాగర్ రావు ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ రావు పాక్స్ చైర్మెన్ లు దామోదర్ రావు సందీప్ రావు మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి మాజీ అధ్యక్షులు పురుషోత్తం రావు కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్ మాజీ జడ్పీటీసీ పెండెం రాములు బాల ముకుందం శరత్ రావు ములసపు మహేష్ ప్రవీణ్ రావు కార్యవర్గ సభ్యులు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం..ఆర్కేపి ఎస్ఐ జాడీ శ్రీధర్



**మంచిర్యాల / రామకృష్ణాపూర్ /అక్టోబర్ 27(వుదయం ప్రతినిధి)**

దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణాపూర్‌లో పోలీస్శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అమర పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియం నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ సూపర్ బజార్ చౌరస్తా వరకు కొనసాగింది. స్థానిక ఎస్ఐ జాడి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో కొవ్వొత్తులు పట్టు కుని ర్యాలీగా సాగిన పోలీసులు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం పోరాడిన పోలీసుల సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలతో నివాళులర్పించి, కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదురైనా ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తూ ప్రాణత్యాగం చేసిన అమర పోలీసుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీసుల త్యాగాలను గుర్తుచేసుకోవడమే కాకుండా, ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీస్ శాఖ నిర్వహిస్తున్న బాధ్యతలను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అమరుల ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, పల్లె రాజు, సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ తిరుపతి, పెద్దపల్లి ఉప్పలయ్య, పిఈటిలు దుబ్బ శ్రీనివాస్, బెల్లం శ్రీనివాస్, బోయిన శ్రీనివాస్, కట్ట ఈశ్వర చారి, డిప్పు శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో 4 కి.మీ. సైకిల్ ర్యాలీ

**జి.ఆర్. కాలనీ వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జిల్లా ఎస్పీ**

**స్వయంగా సైకిల్ తొక్కుతూ ర్యాలీని పూర్తి చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**

**పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం.. ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి**

**ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువకులు**

**- పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాల బలోపేతమే లక్ష్యం**



**కామారెడ్డి, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి):**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కామారెడ్డి పట్టణంలో సుమారు 4 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలోని జి.ఆర్. కాలనీ వద్ద జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా సైకిల్ ర్యాలీలో పాల్గొని, ర్యాలీని పూర్తి చేసి పోలీసు అధికారులు, సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో దేశం, సమాజం, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను, త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేయడం, పోలీసుల విధులు, సేవల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం అని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను ప్రజలకు చేరువ చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.

జి.ఆర్. కాలనీ వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీ హౌసింగ్ బోర్డు కాలనీ, నిజాం సాగర్ చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం, బస్టాండ్, సరస్వతి శిశు మందిర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీదుగా కొనసాగి కళాభారతి వద్ద ముగిసింది. కామారెడ్డి పట్టణ ప్రధాన మార్గాల గుండా సాగిన ఈ ర్యాలీలో పాల్గొన్నవారు పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కే. నరసింహారెడ్డి, కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఇతర పోలీసు ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడిన పోలీసులకు ఎస్పీ ప్రోత్సాహం



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 27 :**

విధి నిర్వహణలో ప్రతిభ కనబరుస్తూ, ప్రజలకు సమర్థవంతమైన సేవలందించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అభినందించి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రజల ప్రాణాలను కాపాడటంతో పాటు నేరాల గుర్తింపులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు.మావల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని సమయస్ఫూర్తితో స్పందించి కాపాడిన డయల్ 100 కానిస్టేబుల్ కె. భుజంగరావు, హోంగార్డు పి. రమేష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో చూపిన చొరవ, మానవతా దృక్పథాన్ని ప్రశంసిస్తూ నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.అదేవిధంగా ట్రాఫిక్ విభాగంలో దొంగ వాహనాలను గుర్తించడంతో పాటు, నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐ ఆర్. దేవేందర్, సిబ్బంది సిహెచ్. రమేష్, కె. రమేష్, టి. రామకృష్ణ, ఎన్. విద్యాసాగర్, జి. సతీష్, ఏ. రామకృష్ణలకు నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో అంకితభావం, సమయస్ఫూర్తి, బాధ్యతాయుతంగా పనిచేసే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటం, నేరాలను నియంత్రించడం, నేరస్తులను గుర్తించడం, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. ప్రజల రక్షణే లక్ష్యంగా క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐ ఆర్. దేవేందర్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్ నినోపై రైతులకు అవగాహన కల్పించాలి..

### ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి)**

ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాలని రామగుండం ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు. మంగళవారం గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, అంతర్గాం మండలాల సర్పంచులు కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. నీటి పొదుపు చెరువులు కుంటల సంరక్షణ ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్ ఆర్ ఎస్ పి నుంచి విడుదలైన 4.5 టీఎంసీల నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇంటి పథకం కింద ఒక్కో గ్రామానికి 130 మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయాలతో ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## రైతుల సమన్వయంతో రీ-సర్వే పూర్తి చేయాలి: కలెక్టర్



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 27 అక్టోబర్ 2026**

రైతులను సమన్వయం చేసుకుంటూ భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కుంటాల మండలం రాజాపూర్ తాండలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో చేపడుతున్న సర్వే పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల హద్దుల నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి సర్వే చేపట్టాలని సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారి సమన్వయంతో పనులు చేపట్టాలని అన్నారు. సర్వే సమయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రీ-సర్వే పనులను మరింత సులభతరం చేసి వేగవంతం చేసేందుకు త్వరలో అదనంగా ఆధునిక సర్వే పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సర్వే సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ కమల్ సింగ్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఆర్యజనని దోహదం

### మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 27:**

ఆరోగ్యవంతమైన తల్లి, ఆరోగ్యవంతమైన బిడ్డతోనే బలమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. గర్భిణుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, భావి తరాల అభివృద్ధికి దోహదపడేలా శ్రీ రామకృష్ణ సేవా సమితి నిర్వహిస్తున్న 'ఆర్యజనని – ధీరమానవుడిని తయారు చేసే ప్రయత్నం' కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో గర్భిణుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారానికి ప్రాధాన్యమివ్వాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలనిసూచించారు.తల్లి ఆరోగ్యంగా ఉన్నప్పుడే బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, వారి ఆరోగ్యం, ఎదుగుదల కోసం అంకితభావంతో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సేవలను అనూష సతీష్ అభినందించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణకు, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తున్న శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులను, అంగన్‌వాడీ సిబ్బందిని ఆమె ప్రశంసించారు.

## జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి..

### సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాంప్లెక్స్ ఎదుట గత 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు సంఘీభావంగా బుధవారం రోజు దీక్షలో కూర్చున్న సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ హెచ్ఎం ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని, వారిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయంపై దేశవ్యాప్తంగా 7రాష్ట్రాల్లో ఏవిధంగా క్రమబద్ధీకరించారో ఆ విధంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎన్ హెచ్ఎం ఉద్యోగులను తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగేల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ యాదవ్, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షులు ఆకుల సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## యాసంగిలో వరికి దూరంగా ఉండండి

**-- సూపర్ ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటలే మేలు**

**-- నీటి వృథాను అరికట్టాలి.. కొత్త బోర్లకు అనుమతి తప్పనిసరి**

**– తెలంగాణ జలసిరి పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 27: (వుదయం ప్రతినిధి):**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు ఈ యాసంగిలో వరి సాగు చేయవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న, కూరగాయలు తదితర ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. నీటి వృథాను అరికట్టి అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా సమీకృత ఎకరాల్లో తక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు చేయవచ్చన్నారు. భూగర్భ జలాలు తగ్గుతున్నందున బోర్లపై ఆధారపడితే విద్యుత్ వినియోగం పెరిగి ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. పశువులకు అవసరమైన పశుగ్రాసం, విత్తనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు ఆదేశించారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద తెలంగాణ జలసిరి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు



కార్యాలయాల సముదాయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైందని, రానున్న మూడు నెలల్లో వర్షాలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట జలాశయాల్లోని నీటిని తాగునీరు, పశువుల అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఒక ఎకరా వరి సాగుకు సుమారు 35 నుంచి 40 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని కలెక్టర్ వివరించారు. అదే నీటితో ఐదు నుంచి ఆరులని రైతులకు సూచించారు. నవంబరు 30 వరకు మండలాల వారీగా 'కేతు బచావో అభియాన్'తో పాటు ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రైతులకు నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. వాల్టా చట్టం ప్రకారం తహసీల్దార్ అనుమతి లేకుండా కొత్త బోర్లు వేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో నీటి వృథాను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతి నల్లాకు ఆన్–ఆఫ్ బటన్ ఏర్పాటు గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు పామ్ పాండ్లు, బోర్‌వెల్ రీఛార్జి గుంతలు, మ్యాజిక్ సోక్ పిట్లు, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలన్నారు. ఈ పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈసమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, డీఆర్‌డీవో లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌బాబు, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**క్రీడా వేదికను పరిశీలించి, అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, అక్టోబర్ 27:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026–27 కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన క్రీడా వేదికను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జాతీయ స్థాయిలో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ మాక్లూర్ మండలం దాస్‌నగర్ సమీపంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌ను సందర్శించి, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా వేదిక, ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో, అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ఎంపిక చేయడం ఎంతో ప్రతిష్టాత్మకమైన విషయమని పేర్కొంటూ, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చాలని, వారి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు ఐదు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నందున, క్రీడాకారుల వసతి, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యసేవలు తదితర సదుపాయాలను సమన్వయంతో ఏర్పాటు చేయాలనిసూచించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం ద్వారా నిజామాబాద్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని, ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం ఇంకనూ ఏవైనా సదుపాయాలు అవసరమైతే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పవన్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్, నవ్య భారతి స్కూల్ కరస్పాండెంట్ సంతోష్, లత, స్థానిక అధికారులు, తదితరులు.

## ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కొబ్బరి ముక్కల వేలం పాట ఖరారు

**రూ. 40 లక్షలకు దక్కించుకున్న వేములవాడ వాసి**



**ధర్మపురి,అక్టోబర్ 27(వుదయం ప్రతినిధి):**

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వా మి దేవస్థానానికి సంబంధించి న లైసెన్సు హక్కుల బహిరంగ వేలం పాటను మంగళవారం మధ్యాహ్నం దేవాదాయ శాఖ పర్యవేక్షకులు ఎం. రాజమోళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, టెండర్దారులు,ఈఓ శ్రీనివాస్ సమక్షంలో ఈ వేలం ప్రక్రియ ముగిసింది.13-01-2027 నుండి 12-01-2029 వరకు దేవాలయ ఆవరణలో కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకునే లైసెన్సు హక్కును వేములవాడ పట్టణానికి చెందిన దూలం జనార్దన్ రూ.40 లక్షలకు దక్కించుకున్నారు.గత కాల పరిమితి హెచ్చుపాట (రూ. 21,90,116/-)తో పోలిస్తే ఇది రూ. 18,09,884/- అధికమని అధికారులు వెల్లడించారు. 18-01-2027 నుండి 17-01-2029 వరకు దేవాలయ ఆవరణలో వస్త్రాలు ప్రోగు చేసుకొని అమ్ముకొనే లైసెన్సు హక్కు వేలంలో ఎవ్వరూ పాల్గొనలేదని ఈఓ తెలిపారు పేర్కొన్నారు.

## బీజేపీ కార్మిక విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక



**ధర్మపురి అక్టోబర్27 (వుదయం ప్రతినిధి):**

బీజేపీ కార్మిక విభాగం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణ కన్వీనర్గా శ్యామ్ రావు నాగు లు, మండల కన్వీనర్ జక్కుల.అనిల్ కుమార్, జిల్లా కో కన్వీనర్ కాసారపు వెంకటేష్ గౌడ్ లను నియమించారు.బీజేపీ జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు అందే శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కట్ట విజయ కుమార్, రాష్ట్ర నాయకులు దామెర రామ్ సుధాకర్ రావు ఆదేశాల మేరకు సమగ్ర సమీక్ష, సీనియర్ నాయకుల సలహా మేరకు కార్మిక విభాగం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులు అందే శ్రీనివాస్ నూతన కన్వీనర్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ, కార్మికుల సమస్యలపై నిరంతరం పోరా డాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, బీజేవైఎంపట్టణ అధ్యక్షులు మండలోజు సురజ్, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కాశెట్టి హరీష్, పులిశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు




## నీటి లీకేజీకి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**మహబూబ్‌నగర్**
మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని ఫైర్ స్టేషన్ సమీపంలో టీడీ గుట్ట వద్ద మంగళవారం నీటి లీకేజీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు.
నీటి లీకేజీని వెంటనే అరికట్టేందుకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సంబంధిత ఏఈని ఆదేశించారు. మంగళవారం సాయంత్రంలోగా మరమ్మతులు పూర్తి చేసి, నీటి లీకేజీని పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు.

## ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి



- **బిజెపి డిమాండ్**

**నారాయణపేట అక్టోబర్ 27(వుదయం ప్రతినిధి )**
ఎన్ ఎచ్ ఎస్ ఉద్యో గుల న్యాయమైన డిమాం డ్లను వెంటనే పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు పగుడాకుల శ్రీనివాసులు, డాక్టర్ సెల్ అద్యక్షుడు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు.మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉద్యోగుల 78 సంఘాలతో ఏర్పాటైన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్ష శిబిరంలో వారు పాల్గొ ని ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 15 రోజులుగా ఎన్ ఎచ్ ఎం ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఉద్యో గులు కోరుతున్న ఉద్యోగాల క్రమబద్ధీకరణ, పనికి తగిన వేతనం, మహిళా ఉద్యోగు లకు ఇతర ప్రభుత్వ శాఖ ల్లో కల్పిస్తున్న విధంగా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిం చకుండా సమ్మెను కొనసా గించే పరిస్థితిని ప్రభుత్వం కల్పించకూడదని అన్నారు. ఉద్యోగుల హక్కుల కోసం జరిగే పోరాటానికి బిజెపి అండగా నిలుస్తుందని, ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి పోరాడు తుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్య ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించ కుండా తక్షణమే చర్చలు జరిపి పరిష్కార మార్గం చూపాలని అన్నారు.

# గంగారం–గోధుమగూడ రోడ్డుపై దుమ్ము దుమారం!

- **మట్టి పోసి వదిలేశారు.. దుమ్ముతో ప్రజల ఉక్కిరిబిక్కిరి**
- **నాణ్యతా లోపాలపై గతంలోనే కథనాలు.. అయినా మారని తీరు**
- **పనులు పూర్తయ్యే వరకు నీళ్లు చల్లాలి.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?**



**వికారాబాద్, అక్టోబర్ 27 (వుదయం బ్యూరో):**
గంగారం-గోధుమగూడ రహదారిపై దుమ్ము దుమారం రేగుతోంది. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మట్టి పోసి వదిలేయడంతో వాహనాల రాకపోకలకు దుమ్ము సమస్యగా మారింది. వాహనం కదిలితే చాలు.. రహదారిపై దుమ్ము మేఘాలు కమ్ముకుంటున్నాయని ప్రయాణికులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, రోడ్డు పక్కన ఉన్న మట్టిని తవ్వి రహదారిపై వేస్తున్నారంటూ గతంలోనే పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. అయినప్పటికీ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
దుమ్ముతో ప్రయాణం నరకప్రాయం!
గంగారం నుంచి గోధుమగూడ వైపు వెళ్లే మార్గంలో రహదారిపై పేరుకుపోయిన మట్టి వాహనాల రాకపోకలతో దుమ్ముగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు దుమ్ము గాలిలోకి ఎగసి పడి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఆరోగ్యంపైనా దుమ్ము ప్రభావం!
రహదారిపై నిరంతరం ఎగసిపడుతున్న దుమ్ముతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము ఎక్కువగా పీల్చడం వల్ల కళ్లలో మంట, అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నంతకాలం దుమ్ము నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా? అధికారుల పర్యవేక్షణ లోపమా?
రోడ్డుపై దుమ్ము సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ కనీసం నీళ్లు చల్లి దుమ్మును నియంత్రించే చర్యలు చేపట్టడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? మట్టి వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరుగుతోందా? పనుల పురోగతిని అధికారులు తనిఖీ చేస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశాలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉంది.
ఇప్పటికైనా స్పందిస్తారా?
గంగారం-గోధుమగూడ రహదారిపై దుమ్ము సమస్యను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. రహదారిపై నీళ్లు చల్లి దుమ్మును నియంత్రించాలని, అవసరాన్ని బట్టి ఉదయం, సాయంత్రం నీటి పిచికారీ చేపట్టాలని కోరుతున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించడం నిర్మాణ సంస్థతో పాటు సంబంధిత అధికారుల బాధ్యత. గతంలోనే సమస్యపై కథనాలు వెలువడిన నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారా? లేక గంగారం-గోధుమగూడ రహదారిపై దుమ్ము కష్టాలు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి.



## ఎల్ నినో విపత్తు విషయం లో రైతులు అప్రమత్తంగా ఉండాలి

- **ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్**

**వుదయం, సిద్దిపేట / చిన్నకోడూరు ప్రతినిధి**
ఎల్ నీనో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నందున రైతులు పంటల సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ అన్నారు. మంగళవారం చిన్నకోడూరు రైతు వేదికలో ఎల్ నీనోపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. యాసంగి సీజన్లో వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల కొరత ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏఓ జయంత్, ఏఈఓలు శ్రీకాంత్, నవీన్,డైరెక్టర్ లు భూపతి రెడ్డి, సలీమ్, అశోక్, మహిపాల్ రెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పర్శరాం,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, గొట్టిపర్తి చంద్,పంతం శ్రీనివాస్, అల్లీపూర్ ఉప సర్పంచ్ కొలన్ పాక శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, కోరిమి రాజు, రెడ్డి మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన–2027 రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి

- **శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి**
- **ప్రతి ఇల్లు, కుటుంబం, వ్యక్తి వివరాల నమోదులో తప్పులకు తావివ్వొద్దు**
- **డేటా ఎంట్రీపై నిరంతర పర్యవేక్షణ.. గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల, అక్టోబర్ 27 వుదయం బ్యూరో**
జనగణన-2027 రెండో దశను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు.
మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా, డివిజన్, సబ్ డివిజన్ స్థాయి ఛార్జ్ అధికారులకు జనగణనపై నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు.
ప్రభుత్వ పథకాల రూపకల్పనకు జనగణనే కీలకం
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగణన ద్వారా సేకరించే సమాచారం భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి కీలక ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఇల్లు, కుటుంబం, వ్యక్తికి సంబంధించిన వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అక్షరాస్యత, విద్యా స్థాయి, కుటుంబ వివరాలతో పాటు ప్రశ్నావళిలోని ప్రతి అంశాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.
డేటా నమోదు నుంచి ధ్రువీకరణ వరకు అప్రమత్తత
జనగణన విధుల నిర్వహణలో ప్రతి స్థాయి అధికారికి స్పష్టమైన బాధ్యతలు కేటాయించి, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమాచారాన్ని సక్రమంగా నమోదు చేసేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.పెండింగ్ పనులకు తావులేకుండా గడువులోగా పూర్తి చేయాలిజిల్లా, మండల, గ్రామ, పట్టణ స్థాయిల్లో పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, పెండింగ్ పనులు లేకుండా నిర్ణీత గడువులో జనగణన ప్రక్రియను పూర్తి



చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజల్లో అవగాహన.. సమాచార గోప్యతకు ప్రాధాన్యం
జనగణనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమాచార సేకరణలో పారదర్శకతతో పాటు వ్యక్తిగత వివరాల గోప్యతను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సమాచార సేకరణ, ప్రశ్నావళి నమోదు, డేటా ఎంట్రీ, సాంకేతిక అంశాలు, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ పాపయ్య, తెలంగాణ స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ సుల్తాన్ అలీ, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ హరిత, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మీడియాకు నో ఎంట్రీ.. అధికారుల తీరుపై బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు ఫైర్!

- **సమీక్షా సమావేశంలో వాగ్వాదం.. మీడియాను ఎందుకు అనుమతించరంటూ నిలదీత**
- **హస్యాలేమున్నాయి? అనుమతించకుంటే ధర్నా చేస్తాం!**

**సంగారెడ్డి:**
ప్రజా సమస్యలపై చర్చించే సమీక్షా సమావేశానికి మీడియాను అనుమతించకపోవడం వివాదానికి దారితీసింది. ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రులు సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశానికి మీడియాకు నో ఎంట్రీ బోర్డు పెట్టినట్లుగా వ్యవహరించడంపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే చింత ప్రభాకర్,తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీడియాను ఎందుకు అనుమతించడం లేదంటూ అధికారులను నిలదీయడంతో సమావేశ ప్రాంగణంలో వాగ్వాదం చోటుచేసుకుంది.ఇదేమైనా పార్టీ సమావేశమా?
సమావేశంలోకి మీడియాను అనుమతించకపోవడంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీఆర్ ఒ విజయలక్ష్మి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. 'ఇదేమైనా పార్టీ సమావేశమా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని, కరువు ముప్పు పొంచి ఉన్న వేళ ప్రజలకు కీలక సమాచారాన్ని చేరవేసే మీడియాను సమావేశానికి ఎందుకు దూరంగా ఉంచుతున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలీసులతోనూ వాగ్వాదానికి దిగారు.దాచాల్సిన రహస్యాలేమున్నాయి?
ప్రజా సమస్యలు, కరువు నివారణ చర్యలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చించే సమావేశానికి మీడియాను అనుమతించకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తాయి. సమావేశంలో దాచాల్సిన రహస్యాలేమున్నాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మీడియాను అనుమతించకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ అధికారులు వెనక్కి తగ్గకుండా మీడియాకు అనుమతి నిరాకరించడంతో వివాదం మరింత చర్చనీయాంశమైంది.
ప్రజలకు సంబంధించిన అంశాలపై జరిగే సమీక్షా సమావేశాల్లో మీడియాను దూరంగా ఉంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలు మీడియాను అనుమతించకపోవడానికి కారణాలేమిటన్న ప్రశ్నకు అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉందని కోరుతున్నారు.




## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం..

- **ప్రభుత్వం స్పందించకపోతే లక్ష మందితో హైదరాబాద్ లో భారీ నిరసన..**
- **పటాన్చెరు శాసనసభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి..**
- **గజ్వేల్ లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో.. గౌరవ వేతన సాధన సభ.. నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం మహోత్సవం..**
- **ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రివర్యులు హరీష్ రావు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**పటాన్చెరు**
పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే రాష్ట్ర రాజధాని లో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.
మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన.. రాష్ట్ర స్థాయి గౌరవ వేతన సాధన సభ, రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాఘనీయమన్నారు. క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లక్ష మందితో కలిసి రాష్ట్ర రాజధానిలో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రేషన్ డీలర్ల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు, సంఘం ప్రతినిధులు, రేషన్ డీలర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గుడిసెలు లేని మెదక్ నిర్మాణమే లక్ష్యం

- **ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించడమే సంకల్పం: ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్**

**మెదక్,అక్టోబర్,27,మెదక్ (వుదయం ప్రతినిధి)**



నియోజకవర్గంలో గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసి, గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు.ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, అది కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భరోసా కల్పించే పునాది అని పేర్కొన్నారు.గుడిసెలు లేని మెదక్‌ను నిర్మించడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తూ, అభివృద్ధి చెందిన మెదక్ నిర్మాణానికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

## అచ్చంపేటలో నేడు "డయల్ యువర్ డి.ఎం." కార్యక్రమం

**అచ్చంపేట అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి)**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) అచ్చంపేట డిపో ఆధ్వర్యంలో నేడు (27.10.2026) మధ్యాహ్నం 12:00 గం. నుండి 01:00 గం. వరకు "డయల్ యువర్ డి.ఎం." కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బి. శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ప్రయాణికులు తమ సూచనలు, సమస్యలు, ఫిర్యాదులు ఏవైనా ఉంటే నేరుగా డిపో మేనేజర్ కు తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9959226291ఈ అవకాశాన్ని అచ్చంపేట ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

## ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



- **బీజేపీ పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్**

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 27 (వుదయం బ్యూరో) :**
ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 15 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరసనకు మంగళవారం బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జీతాలను ప్రతి నెల 5వ తేదీలోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు, విధుల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం, అర్హతను బట్టి ఉద్యోగం, ప్రతి ఏటా 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ ఇవ్వాలని కోరారు.అనేక రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారని, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఉద్యోగుల కోసం ఏ స్థాయి పోరాటానికైనా సిద్ధమని, జేఏసీ ఎప్పుడు పిలుపునిచ్చినా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, టౌన్ జనరల్ సెక్రటరీలు జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, సీనియర్ నాయకులు పరశురాం, లక్ష్మయ్య, శివకుమార్, బూత్ అధ్యక్షుడు విజయ్ కుమార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూ సమగ్ర సర్వే పనులను వేగవంతం చేయాలి

- **అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్**
- **చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రెవెన్యూ అంశాలపై సమీక్ష**

**వనపర్తి అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి)**



వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ మంగళవారం చిన్నంబావి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా చెల్లెపాడు గ్రామంలో జరుగుతున్న భూ సమగ్ర సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ పనితీరు, వివిధ రెవెన్యూ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా భూ సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. చెల్లెపాడు గ్రామంలో సర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో గ్రామస్తులు, రైతులను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని, రైతులకు ముందస్తు సమాచారం అందించి వారి భూముల సర్వే సమయంలో వారు తప్పనిసరిగా హాజరయ్యేలా అవగాహన కల్పించాలని తెలిపారు. భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారిస్తూ, సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
అనంతరం చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి, సదాబైనామా కింద అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూదాన్ భూములకు సంబంధించిన వివరాలను భూ భారతి పోర్టల్‌లో వెంటనే నమోదు చేసి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.
ముఖ్యమంత్రి, జిల్లా, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాల ద్వారా అందిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.
రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఫారం 18 ద్వారా అందిన దరఖాస్తుల విచారణను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.
తహసీల్దార్ శ్రీనివాస్ ఇతర అధికారులు ఉన్నారు.



## రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా దాచేపల్లి శ్రీనివాసులు

**కల్వకుర్తి, అక్టోబర్ 27 (వుదయం ప్రతినిధి) :**
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా దాచేపల్లి శ్రీనివాసులు నియమితులయ్యారు.
మంగళవారం రాష్ట్ర అధ్యక్షులు అమరవడి లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దాచేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. ఆర్యవైశ్యులందరినీ రాజకీయంగా చైతన్యవంతులను చేస్తూ ఐక్యతతో సమాజాభివృద్ధికి కృషి చేస్తానని, ఆర్యవైశ్యులకు రాజకీయంగా ఉన్నత పదవులు లభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంధం కిరణ్ ప్రసాద్, గంప శీను, ఆకారపు శివ, కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం వద్ద సీసీ నిర్మాణం పనులు



**వుదయం ప్రతినిధి నిజాంపేట**
మండల పరిధిలోని నందిగామ గ్రామ శివాలయం దగ్గర గ్రామానికి చెందిన రాగుల బాలయ్య తన సొంత డబ్బులతో సిసి రోడ్ వేయడం జరిగింది. బాలయ్య కుటుంబ సభ్యులను ఆ పరమశివుని ఆశీస్సులు ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల స్వప్న రమేష్ మాజీ సర్పంచ్ సంగు స్వామి తదితరులు పాల్గొన్నారు.

### వొడాఫోన్ ఐడియా షాక్..

ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా వినియోగదారులకు షాకిచ్చింది. తన ప్రీపెయిడ్ ప్లాన్ ధరను పెంచేసింది. ఇంతకుముందు 84 రోజుల వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.859 ఉండగా.. దీనిపై రూ.40 పెంచింది. దీంతో ఈ ప్లాన్ ధర రూ.899కు చేరింది. పెంచిన ధరలు కంపెనీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి. 84 రోజుల వ్యాలిడిటీ కలిగిన రూ.899 రీఛార్జ్ ప్లాన్‌పై రోజుకు 1.5 జీబీ హైస్పీడ్ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి.




# ఇథనాల్ బ్లెండింగ్‌ను ఇప్పుడే పెంచే ఉద్దేశం లేదు: హర్దీప్ పురి



ఇథనాల్ బ్లెండింగ్ పెట్రోల్‌పై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక వ్యాఖ్యలు చేశారు. పెట్రోల్‌లో ప్రస్తుతం 20 శాతంగా ఉన్న ఇథనాల్ బ్లెండింగ్‌ను ఇప్పుటికిప్పుడు పెంచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. ఈ మేరకు గోవాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ20 లక్ష్యంగా కల్పిత కథనాలు చక్కర్లు కొడుతున్నాయని మంత్రి ఆరోపించారు. చమురు దిగుమతుల బిల్లును తగ్గించుకునే ఉద్దేశంతో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్‌ను కేంద్రం ప్రోత్సహిస్తోందని మంత్రి చెప్పారు. కరెంట్ ఖాతా లోటును పూడ్చుకోవడంలో ఇదో వ్యూహమని పేర్కొన్నారు. కానీ, ఈ20 లక్ష్యంగా దుష్ప్రచారం జరుగుతోందన్నారు. 2003కు ముందున్న వాహనాల్లో ఈ20 పెట్రోల్ వినియోగం వల్ల కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. కానీ, ఈ20 వల్ల వాహనాలు మొరాయిస్తున్నాయని, ప్రభుత్వం కూడా బ్లెండింగ్ ఫ్యూయల్ విక్రయాలు నిలిపివేసిందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందని చెప్పారు. ఆ పోస్టులను తానూ చూశానని అన్నారు. ఈ20 వల్ల ఒక వాహన కంపెనీకి చెందిన ఇంజిన్లు డ్యామేజీ అవుతున్నాయంటూ అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై సంబంధిత ఆటోమొబైల్ కంపెనీ కేసు వేసిందని హర్దీప్ సింగ్ పురి అన్నారు. కాబట్టి ఈ20పై జరుగుతున్నది ఉత్తి కల్పిత ప్రచారం అని కొట్టిపారేశారు. దేశంలో రోజూ 6 కోట్ల వాహనాలకు పెట్రోల్ పంపులకు వెళుతుంటాయని, ఒకవేళ నిజంగా సమస్య ఉంటే దేశవ్యాప్తంగా అది కనిపించాలి కదా! అన్నారు. ఈ20 పెట్రోల్ వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.1.60 లక్షల కోట్లు ఆదా అయ్యిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. అందులో రైతులకు రూ.1.40 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని మంత్రి వివరించారు.

# జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్..



రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం, డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అక్టోబరు 28న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద రూ.10.3 లక్షల కోట్ల మార్కెట్ విలువతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో నమోదు కానుంది. రూ.10 లక్షల కోట్ల మార్కెట్ విలువతో వస్తున్న తొలి కంపెనీగా జియో రికార్డులకెక్కనుంది. ఇప్పటి వరకు ఏ భారతీయ కంపెనీ కూడా ఈ మార్కెట్ విలువ వద్ద లిస్టింగ్‌కు రాలేదు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.16.2 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ.12.2 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.10.6 లక్షల కోట్లు) మార్కెట్ విలువ పరంగా టాప్-3లో ఉన్నాయి. ఐపీఓ వాల్యూషన్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ నాలుగో అతిపెద్ద కంపెనీగా అవతరించనుంది.

జియో ప్లాట్‌ఫామ్స్ షేర్లు ప్రీమియంతో లిస్టయ్యే అవకాశం ఉన్నట్లు గ్రే మార్కెట్ ప్రీమియం (GMP) సూచిస్తోంది. ఆ లెక్కన ఇష్యూ ధరతో (రూ.1119) పోలిస్తే 20 శాతం ప్రీమియంతో రూ.1340 వద్ద లిస్టయ్యే అవకాశం ఉందని అంచనాలున్నాయి. అదే జరిగితే కంపెనీ మార్కెట్ విలువ రూ.12.3 లక్షల కోట్లకు చేరుతుంది. దీంతో మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత రెండో అతిపెద్ద కంపెనీగా జియో ప్లాట్‌ఫామ్స్ నిలుస్తుంది.

ఐపీఓ వాల్యూషన్ ప్రకారం చూసినా రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ప్లాట్‌ఫామ్స్ కంపెనీల మార్కెట్ విలువ రూ.27 లక్షల కోట్లుగా ఉంది. 2026 అక్టోబరు 27నాటికి టాటా గ్రూపునకు చెందిన 32 లిస్టెడ్ కంపెనీల కంబైన్డ్ మార్కెట్ విలువ రూ.25.7 లక్షల కోట్లుగా ఉంది. అదానీ గ్రూపునకు చెందిన 11 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.16.6 లక్షల కోట్లుగా ఉంది. ఒకవేళ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ప్రీమియం ధర వద్ద లిస్టయితే రిలయన్స్ గ్రూప్ మార్కెట్ విలువ సుమారు రూ.30 లక్షల కోట్లకు చేరుతుంది.

# 100% ఇథనాల్‌తో నడిచే వాహనాలకు అనుమతి




ఇప్పటిదాకా ఇ20 ఇంధనం(పెట్రోల్‌లో 20% ఇథనాల్ కలిపిన ఇంధనం)తో వాహనాలు నడుస్తుండగా, ఇక పూర్తిగా ఇథనాల్‌తోనే నడిచే వాహనాలకు అనుమతులు లభించాయి. ఆ మేరకు భారత రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌టీహెచ్) 100% ఇథనాల్‌తో నడిచే ఇ100 ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలను అనుమతిస్తూ కేంద్ర మోటారు వాహనాల నిబంధనల్లో మార్పులను సోమవారం నోటిఫై చేసింది. ఇ20 కంటే ఎక్కువ, ఇ100 వరకు ఉండే ఇంధనం కేవలం ఆ ఇంధనానికి తగ్గట్టుగా ప్రత్యేకంగా తయారు చేసి, ధ్రువీకరించిన వాహనాలకే వర్తిస్తుంది. సాధారణ వాహనాలు లేదా ఇ20 వాహనాల్లో ఇ85 లేదా ఇ100 ఇంధనాన్ని ఉపయోగించలేరు. ఈ మార్పుల వల్ల ప్రభావితమయ్యే తేలికపాటి పెట్రోల్, డీజిల్ వాహనాల బరువు పరిమితిని 3,000 కిలోల నుంచి 3,500 కిలోలకు పెంచారు.

### ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. చమురు ధరలు గరిష్ఠ సాయుల వద్ద కొనసాగుతుండడం, ఈ వారం చివర్లో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయాలు వెలువడనుండడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటీ, ప్రైవేట్ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. దీంతో రోజంతా లాభనష్టాల మధ్య కదలాడిన సూచీలు.. చివరికి స్వల్ప నష్టంతో ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 73,484.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,606.75) నష్టాల్లో ప్రారంభమైంది. ట్రేడింగ్ సెషన్‌లో ఎక్కువ భాగం నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో కనిష్ఠాల నుంచి 400 పాయింట్లు కోలుకొని చివరికి 8.08 పాయింట్ల నష్టంతో 73,598.67 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3.45 పాయింట్లు కోల్పోయి 22,749.75 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.11గా ఉంది.

# ఈపీఎస్ కనీస పెన్షన్ పెరగనుందా? వచ్చే నెలలో కీలక భేటీ



ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (EPS) కింద చెల్లించే కనీస పింఛను పెంపు డిమాండ్‌కు ఎట్టకేలకు మోక్షం లభించనుందా? అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO) దీనిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 19న గుజరాత్‌లో జరిగే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల (CBT) సమావేశంలో దీనిపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ కింద.. ప్రస్తుతం కనీస పెన్షన్ రూ.1000 చెల్లిస్తున్నారు. దీన్ని చివరిసారిగా 2014 సెప్టెంబర్‌లో సవరించారు. ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా ఈ మొత్తం సరిపోదని, కనీస పింఛనును రూ.7,500 చేయాలని పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కొన్నేళ్లుగా పెన్షనర్ల సంఘం పోరాటం చేస్తోంది. ఇటీవలే ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచిన కేంద్రం.. ఈ క్రమంలోనే కనీస పెన్షన్ మొత్తంపైనా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే, పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నంత కాకుండా.. కొంత మొత్తం పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు బడ్జెట్‌లో ఎంత కేటాయించాలనేది వచ్చే సీబీటీ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. 60 వేల మందికి మైక్రోసాఫ్ట్ ఎగ్జిట్ ఆఫర్.. హైదరాబాద్ ఆఫీస్‌పై ఎఫెక్ట్ ఉండొచ్చా..? ఈపీఎస్ పెన్షన్ స్కీమ్ కింద యజమాని చెల్లించే వాటాలో 8.33 శాతం పెన్షన్ ఫండ్‌లోకి వెళుతోంది. సవరించిన గరిష్ఠ వేతన పరిమితి ప్రకారం.. నెలకు రూ.2083 చొప్పున ఈ నిధికి చేరుతుంది. పెన్షనబుల్ శాలరీ× పెన్షనబుల్ సర్వీస్/ 70 ఫార్ములా ఆధారంగా ఒక వ్యక్తికి వచ్చే పెన్షన్‌ను లెక్కిస్తున్నారు. ఎవరికైనా ఈ మొత్తం రూ.వెయ్యికంటే తక్కువగా ఉంటే.. తక్కువ పడిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఒకవేళ కనీస పెన్షన్ మొత్తం పెంచితే బడ్జెట్‌లో ఆ మేర కేటాయింపులు చేయాల్సి ఉంటుంది.






### అభిషేక్ మెరుపు సెంచరీ.. 13 ఓవర్లలోనే టార్గెట్ ఫినిష్!

న్యూజిలాండ్‌తో మూడో టీ20లో భారత్ (NZ vs IND) ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (113; 38 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో విరుచుకుపడ్డాడు. వైభవ్ సూర్యవంశీ (45; 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా చెలరేగాడు. వీరిద్దరూ చెలరేగడంతో భారత్ పవర్ ప్లేలోనే 118 పరుగులు చేయడం విశేషం. ఈ జోడీ తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. 15 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న అభిషేక్ .. మరో 20 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో అతడికిది నాలుగో సెంచరీ. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది. నాలుగో టీ20 శుక్రవారం జరగనుంది.

# టీమ్ ఇండియా రికార్డుల సునామీ

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ రికార్డుల సునామీ సృష్టించి ఘన విజయం సాధించింది. 199 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన టీమ్ ఇండియా బ్యాటర్లు ఎక్కడా కివీస్ బౌలర్లకు ఛాన్స్ ఇవ్వలేదు. ఈ క్రమంలో మన జట్టు చాలా రికార్డులు బద్దలు కొట్టింది. మన ఆటగాళ్లు అరుదైన ఘనతలూ అందుకున్నారు. అవేంటో చూద్దాం.ఎదుర్కొన్న తొలి బంతికే ఎక్కువ సార్లు సిక్స్ కొట్టిన వారి జాబితాలో అభిషేక్ శర్మ (8 సార్లు) తొలి స్థానంలో ఉన్నాడు.

తొలి ఓవర్‌లో ఎక్కువసార్లు సిక్స్‌లు బాదిన ఘనత అభిషేక్ శర్మదే. ఇప్పటివరకు 17 మ్యాచుల్లో తొలి ఓవర్‌లో సిక్స్ కొట్టాడు.



అతి తక్కువ బంతుల్లో భారత్ 50 పరుగులు పూర్తి చేసుకున్నది ఈ మ్యాచ్‌లోనే. 2.2 ఓవర్లలో 50 పరుగుల మైలురాయి దాటేసింది. ఫుల్ మెంబర్ దేశాల్లో భారత్‌దే తొలి స్థానం.

తొలి ఓవర్‌లో భారత్‌కు 26 పరుగులు వచ్చాయి. ఐసీసీ ఫుల్ మెంబర్ హోదా ఉన్న దేశంపై మరో దేశానికి ఇవే అత్యధిక పరుగులు.

వేగంగా 50 పరుగులు చేసిన భారత బ్యాటర్ల జాబితా టాప్ 5లో అభిషేక్ శర్మ రెండోసారి స్థానం సంపాదించాడు. ఈ మ్యాచ్‌లో 15 బంతుల్లో అర్ధశతకం బాదాడు. అంతకు ముందు 14 బంతుల్లో 50 చేశాడు.

భారత్ టీ20ల్లో వేగంగా 100 పరుగులు చేసిన మ్యాచ్ ఇదే. ఇప్పుడు 5 ఓవర్లు కాగా, గత రికార్డు 6 ఓవర్లు. అప్పుడు అఫ్గానిస్థాన్‌పై ఈ ఘనత సాధించింది.

పవర్ ప్లేలో అత్యధిక పరుగులు సాధించిన జట్టు భారత్. తొలి ఆరు ఓవర్లలో 118 పరుగులు చేశారు మన బ్యాటర్లు.

న్యూజిలాండ్‌పై ఓ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన రెండో బ్యాటర్‌గా అభిషేక్ శర్మ (11) నిలిచాడు. భారతీయుల్లో అతడే ఫస్ట్.

టీ20ల్లో అత్యధిక శతకాలు సాధించిన ఆరో బ్యాటర్ అభిషేక్ (4). రోహిత్ శర్మ కెరీర్‌లో ఐదు శతకాలు ఉన్నాయి.

సెంచరీ సాధించినప్పుడు రెండో అత్యధిక స్ట్రైక్ రేట్ ఉన్నది అభిషేక్ శర్మకే. ఈ మ్యాచ్‌లో 297.36 స్ట్రయిక్ రేట్‌తో ఆడాడు. ఈ జాబితాలో తొలి స్థానం కూడా అతడిదే. అఫ్గానిస్థాన్‌పై ఈ ఏడాదే 317.64 స్ట్రయిక్ రేట్‌తో సెంచరీ కొట్టాడు.

190+ పరుగుల లక్ష్యాన్ని అతి తక్కువ ఓవర్లలో ఛేజ్ చేసిన జట్టు భారత్. 13.2 రెండో ఓవర్లలో ఈ మ్యాచ్‌లో 199 కొట్టింది. (ఐసీసీ ఫుల్ మెంబర్ దేశాల్లో)

టీ20ల్లో వేగవంతమైన 150 పరుగుల రికార్డును భారత్ ఈ మ్యాచ్‌లో సాధించింది. 7.2 ఓవర్లలోనే మన బ్యాటర్లు 150 పరుగులు చేశారు.

ఛేజింగ్‌లో ఎక్కువ బాల్స్ మిగిలిన ఉన్న మ్యాచ్ ఇదే. 40 బంతులు మిగిలి ఉండగానే మన జట్టు గెలిచేసింది. (ఫుల్ మెంబర్ దేశాల్లో).

# సింధుకు 'హైలో' సవాల్



ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు.. వెంటనే మరో పోరుకు సిద్ధమైంది. ఈ రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మంగళవారం ప్రారంభం కానున్న హైలో ఓపెన్‌లో బరిలోకి దిగబోతోంది. ఆదివారం ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ క్రీడాకారిణి ఆన్ సె యాంగ్‌ను ఛేదించలేకపోయిన సింధు.. వరుసగా 11వ సారి ఆమెకు తలొంచింది. అయితే మంచి ఫామ్‌లోనే ఉన్న ఆమె జర్మనీలో సత్తాచాటాలని పట్టుదలగా ఉంది. ఆమె మహిళల సింగిల్స్‌లో నెస్లిహా అరిన్ (తుర్కియే)తో పోరుతో టైటిల్ వేట ఆరంభిస్తుంది. మిగతా సింగిల్స్‌లో చౌచువాంగ్ (థాయ్‌లాండ్)తో దేవిక సిహాగ్, నాల్బంటోవా (బల్గేరియా)తో అస్మిత చాలిహా, తెరెజా స్వాబికోవా (చెక్)తో ఉన్నతి హుడా తలపడనున్నారు.

మరోవైపు 2019లో హైలో విజేతగా నిలిచిన లక్ష్య సేన్.. మరోసారి ఈ టైటిల్‌పై కన్నేశాడు. పారిస్ టోర్నీలో గాయం కారణంగా ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చి తొలి రౌండ్లోనే నిష్క్రమించిన అతడు.. మునుపటి ఫామ్ అందుకోవాలని ఉత్సాహంగా ఉన్నాడు. లక్ష్య పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో జొయాకిమ్ ఓల్డార్ఫ్ (ఫిన్లాండ్)తో తలపడనున్నాడు. యువ ఆటగాడు ఆయుష్ శెట్టి లి యాంగ్ (తైవాన్)ను ఢీకొంటాడు. తరుణ్ మన్నెపల్లి.. తోమా జూనియర్ పొపొవ్ (ఫ్రాన్స్)తో, హెచ్‌ఎస్. ప్రణయ్.. అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్)తో, కిరణ్ జార్జ్.. జున్ వెయ్ (మలేసియా)తో పోటీ పడనున్నారు.

# 7న బరిలోకి బుమ్రా, పంత్




టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వచ్చే నెల 7న మైదానంలో దిగబోతున్నాడు. ఆసియా క్రీడల తర్వాత విశ్రాంతి తీసుకుంటున్న అతడు..న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు బంతి పట్టుకోనున్నాడు. నవంబరు 7న కివీస్-ఎతో మూడో అనధికార టెస్టులో బుమ్రా భారత్-ఎ తరఫున ఆడనున్నాడు. అతడితో పాటు రిషబ్ పంత్ కూడా జట్టులో చేరనున్నాడు. ప్రస్తుతం ఈ ఇద్దరూ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్నారు.

# ఫేవరెట్‌గా భారత్

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌కు వేళైంది. మంగళవారం ఆరంభమయ్యే ఈ ట్రోఫీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం తలపడనుంది. ఆరు దేశాలు తలపడే ఈ టోర్నీకి పంజాబ్‌లోని జలంధర్ వేదికగా నిలవనుంది. దాదాపు కీలక ఆటగాళ్లందరూ ఈ టోర్నీలో ఆడుతున్నారు. గాయంతో మన్‌ప్రీత్ సింగ్ ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. భద్రత కారణాలతో పాకిస్థాన్ దూరం కావడంతో ఆ స్థానంలో బంగ్లాదేశ్ ఈ టోర్నీలో ఆడే అవకాశాన్ని దక్కించుకుంది. మలేసియా, చైనా, జపాన్, దక్షిణ కొరియా ఈ టోర్నీలో మిగిలిన జట్లు. గ్రూప్ దశలో ప్రతి జట్టు మిగిలిన టీమ్‌తో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన టీమ్‌లు సెమీఫైనల్ చేరతాయి. 17 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత పంజాబ్‌కు ఓ హాకీ టోర్నమెంట్ వచ్చింది. చివరగా 2009లో గోల్డ్ కప్ జరిగింది. భారత హాకీకి ఎందరో దిగ్గజ ఆటగాళ్లను అందించిన చరిత్ర జలంధర్‌కు ఉంది. ఇక్కడ నుంచి 14 మంది ఒలింపియన్లు రావడం విశేషం. 300 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్లు జలంధర్‌లో తయారయ్యారు.



# కాకా'లో మెగాస్టార్ ఎంట్రీ సీక్వెన్స్ అదే !



**వుదయం సినిమా:** మెగాస్టార్ చిరంజీవి – బాబీ కొల్లి కాంబినేషన్‌లో కాకా సినిమా రాబోతుంది. ఐతే, సినిమాలో మెగాస్టార్ ఎంట్రీ సీన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ ఎంట్రీ సీన్ పై ఓ న్యూస్ వినిపిస్తోంది. భారీ యాక్షన్ సీక్వెన్స్ తో ఎంట్రీ సీన్ వస్తోందని.. ఓ స్కూల్ లో జరిగిన దాడి కారణంగా భారీ టెన్షన్ మొదలవుతుందని.. ఒక్కసారిగా బాంబ్ బ్లాస్ట్ అవుతున్న క్రమంలో, చిరు ఎంట్రీ ఇచ్చి స్కూల్ పిల్లలను సేవ్ చేస్తాడని తెలుస్తోంది. ఈ సీక్వెన్స్ కి సినిమా టైటిల్ కి కూడా లింకు ఉందట.అన్నట్టు డిసెంబర్ మొదటి వారం లోపు ఈ సినిమా చిత్రీకరణను ముగించాలని టీమ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇక ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని KVN ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది. థమన్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. మొత్తానికి 'కాకా' టీమ్ సంక్రాంతి విడుదల లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. జనవరి 13, 2027న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

# ‘ఓం’ మూవీలో నిత్యారెడ్డిగా సాయిపల్లవి..



**వుదయం సినిమా:** వెర్సటైల్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా.. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఓం – చాప్టర్ 1: ఉధిరం – ది బ్లడ్ వుడ్’ నుంచి హీరోయిన్ సాయిపల్లవి క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియో విడుదలైంది. ఈ సినిమాలో ఆమె నిత్యారెడ్డి అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో సాయిపల్లవి ఆకట్టుకుంటున్నారు. పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఆమె తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు.సాయి పల్లవి పాత్ర విషయానికి వస్తే.. నిత్యారెడ్డి తెలివితేటలు, నిజాయతీ, అనుభవం ఉన్న యువ పోలీస్ ఆఫీసర్‌గా పరిచయమైంది. గతంలో సీబీఐ, ఇంటర్‌పోల్‌లో పనిచేసిన ఆమె.. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చేపట్టిన ‘ఆపరేషన్ ఓం’ను ఆమె లీడ్ చేస్తుంది. ఈ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలో సాయిపల్లవి పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్‌లో ఆకట్టుకున్నారు. అధికారాన్ని ప్రతిబింబించే బాడీ లాంగ్వేజ్, లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో పాటు నిత్యారెడ్డి పాత్రలోని విభిన్న కోణాలను ఈ వీడియోలో చూపించారు. సహజమైన నటన, హావభావాలతో ప్రేక్షకులను మెప్పించే సాయి పల్లవి.. నిత్యా రెడ్డి పాత్రతో మరో కొత్త సవాల్‌ను స్వీకరించారు. ఈ పాత్ర కోసం ఆమె చేసిన అద్భుతమైన మేకోవర్, పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ధనుష్ ‘ఓం ఫస్ట్ స్ట్రైక్’, మమ్ముట్టి ‘బర్మా కార్తికేయన్’ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలకు అభిమానుల నుంచి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే ఈ మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ సింగిల్‌తో పాటు ఇటీవల వచ్చిన రెండో పాట ‘వీరా వీరా’ కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.

# వుదయం సినిమా

MOVIE TIME!

# నాగచైతన్య, కార్తీక్ దండు, ఎస్వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ ‘వృషకర్మ’



**వుదయం సినిమా:** యువ సామ్రాట్ నాగచైతన్య ప్రతిష్టాత్మక మైథలాజికల్ థ్రిల్లర్ ‘వృషకర్మ’ ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఎస్వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ‘వృషకర్మ’ ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది.తాజాగా ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ ద్వారా ‘వృషకర్మ’ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ రైట్స్‌ను ఫ్యాన్సీ ధరకు సొంతం చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్‌తో దిల్ రాజు అసోసియేషన్ సినిమాపై ఆయనకున్న నమ్మకాన్ని, ప్రేక్షకులను ఆకట్టుకునే కంటెంట్‌పై ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోంది.ఈ సినిమా ప్రొడక్షన్ స్కేల్ కూడా ఇప్పటికే చర్చనీయాంశంగా మారింది. కథలోని కీలక భాగం కోసం భారీ స్థాయిలో నిర్మించిన గుహ సెట్‌ను చూపిస్తూ ఆదివారం మేకర్స్ విడుదల చేసిన వీడియో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ జానర్ అడ్వెంచర్‌కు అవసరమైన విజువల్ వరల్డ్‌ను సృష్టించేందుకు టీమ్ ఎంతటి శ్రమ తీసుకుందో ఈ సెట్ తెలియజేస్తోంది. ఇప్పటికే విడుదలైన బీటీఎస్ గ్లింప్స్, పోస్టర్లు సినిమాపై మంచి ఆసక్తిని పెంచాయి.ఈ సినిమాలో నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు.రగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్, నవీన్ నూలి ఎడిటింగ్ .నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా, ఆయన కెరీర్‌లోనే అత్యధిక ప్రీ–రిలీజ్ బిజినెస్‌ను కూడా సాధించింది. ప్రేక్షకులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ ‘వృషకర్మ’పై పాజిటివ్ బజ్ నెలకొంది.

# ‘భోగి’ డబ్బింగ్ పూర్తి చేసిన హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్

**వుదయం సినిమా:** చార్మింగ్ స్టార్ శర్వా పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’ ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర–ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్



పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కందుల సులోచన రాణి పాత్రలో ఆమె ఫస్ట్ లుక్, పాటల్లో ఆమె ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి.తాజాగా అనుపమ పరమేశ్వరన్ తన పాత్రకు డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియో నుంచి రిలీజ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది.ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి మరో హీరోయిన్ గా నటిస్తున్నారు.ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్.ఈ సినిమా నవంబర్ 12న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

# నవంబర్ 13న "చంద్రయాన్"

**వుదయం సినిమా:** రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో "చంద్రయాన్" టైటిల్ తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్ పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన "చంద్రయాన్" సినిమా నవంబర్ 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు "చంద్రయాన్" సినిమా రాకెట్ రివీల్ ఈవెంట్ ను డైరెక్టర్ సంకల్ప్ రెడ్డి అతిథిగా హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ బాబా మాస్టర్ మాట్లాడుతూ – ఈ సినిమాకు వర్క్ చేసినవాళ్లంతా నా



ఫ్యామిలీ మెంబర్స్ లాంటి వాళ్లు. ఈ సినిమాకు వర్క్ చేసే అవకాశం కల్పించిన మా డైరెక్టర్ శ్రీనాథ్ కు థ్యాంక్స్ చెబుతున్నా. ఈ వేదిక మీద పర్ ఫార్మ్ చేసిన సాంగ్ కు హర్ష మంచి మ్యూజిక్ ఇచ్చారు. చంద్రయాన్ సినిమా ఒక కొత్త తరహా కాన్సెప్ట్ తో మన ముందుకు రాబోతోంది. అన్నారు.డీవోపీ శ్రీనివాస. బి. మాట్లాడుతూ – మా చంద్రయాన్ సినిమా రాకెట్ రివీల్ కాన్సెప్ట్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ఈ సినిమాకు వర్క్ చేసే అవకాశం మా శ్రీనాథ్ అన్న కల్పించారు. అలాగే మా వేణు ఊడుగుల అన్న టీమ్ అందరికీ సపోర్ట్ గా ఉండి నడిపిస్తున్నారు అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ హర్ష ప్రవీణ్ మాట్లాడుతూ – చంద్రయాన్ సినిమాకు పనిచేయడం ఒక పెద్ద అవకాశంగా భావిస్తున్నా. ఈ సినిమాకు కొత్త తరహాలో మ్యూజిక్ చేసే అవకాశం దక్కింది. మా సినిమాలో మ్యూజిక్ మీకు తప్పకుండా కొత్తగా అనిపిస్తుంది. నవంబర్ 13న రిలీజ్ కు వస్తున్న మా సినిమాను చూసి ఆదరించాలని కోరుతున్నా. అన్నారు.నటుడు లోకేష్ మాట్లాడుతూ – ఈ సినిమాలో నా క్యారెక్టర్ పేరు చిన్నా. అయితే నేను చేసే కామెడీ పెద్దగా ఉంటుంది. రాకెట్ లాంఛ్ ఇక్కడ చేశాం. నవ్వుల లాంఛ్ నవంబర్ 13న థియేటర్స్ లో చేయబోతున్నాం. ఈ రాకెట్ ఆకాశంలోకి ఎగిరిపోతుంది. మా సినిమాలోని నవ్వులు మీ మనసులో నిలిచిపోతాయి. ఎక్కాలు కూడా రాని మేము ఈ రాకెట్ ఎలా తయారు చేశాం, చందమామ వరకు వెళ్లామా లేదా అనేది థియేటర్స్ లోనే చూడాలి అన్నారు. నటుడు రవి శివతేజ మాట్లాడుతూ – మా సినిమా నవంబర్ 13న థియేటర్స్ లోకి వస్తోంది. మీరు మీ ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా సినిమా చూడొచ్చు. ఒక కొత్త అనుభూతిని మీకు కలిగించే చిత్రమిది. ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్న శివకుమార్ ను ఆదరించండి. మీరు సక్సెస్ ఇస్తే ఇలాంటి యంగ్ హీరో మరిన్ని చిత్రాలు చేయగలుగుతారు. అన్నారు. హీరోయిన్ స్వప్న ప్రియదర్శిని మాట్లాడుతూ – చంద్రయాన్ నాకు స్పెషల్ మూవీ అన్నారు.

# ‘అలియాస్ రుక్మిణి’ నుంచి సాంగ్

**వుదయం సినిమా:** బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మాణంలో ప్రేమ, హాస్యం కలగలిసిన కథతో రూపొందుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఫస్ట్ సింగిల్ ‘రుక్కు రుక్కు రుక్మిణి’ లవ్ సాంగ్ ను విడుదల చేశారు.విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ పాట వినసొంపైన మెలోడీతో ఆకట్టుకుంటోంది. ఆహ్లాదకరమైన



ట్యూన్స్‌కు గిటార్, వయొలిన్‌తో కూడిన చక్కని ఆర్కెస్ట్రేషన్ తోడవడంతో పాటకు మంచి రొమాంటిక్ ఫీల్ వచ్చింది. తనతో కలిసి కోర్టులో పనిచేసే కృష్ణకు, ప్రతిరోజూ తాను వెళ్లే దారిలో కనిపించే స్కూల్ టీచర్ రుక్మిణిపై ప్రేమ కలుగుతుంది. ఆమె రాకతో తన జీవితానికి కొత్త అర్థం వచ్చిందని భావించే కృష్ణ, తన ప్రేమను మనసు కు హత్తుకునే పదాలతో వ్యక్తపరుస్తాడు. అయితే, తన ప్రేమను రుక్మిణికి చెప్పినప్పు డు ఆమె ఎలా స్పందిస్తుందోననే డైలామాలో ఉంటాడు.

# మానవత్వాన్ని చాటుకున్న దశరథ..



**వుదయం సినిమా:** తెలుగు సినీ పరిశ్రమలో నటుడిగా తనదైన గుర్తింపు సంపాదించుకుంటున్న అయినబత్తిన దశరథ మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. ‘వెంకీ’ సినిమా ద్వారా ప్రేక్షకులకు సుపరిచితమైన కమెడియన్ రామచంద్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న దశరథ, ఆయనను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. బ్రెయిన్ ట్యూమర్, పక్షవాతం సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రామచంద్రకు దశరథ ధైర్యం చెప్పారు. తోటి కళాకారుడి కష్టాన్ని అర్థం చేసుకుని, తన వంతు సహాయం అందించడం ద్వారా మానవత్వమే నిజమైన గొప్పతనమని చాటుకున్నారు.ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమలోని హీరోలు, హీరోయిన్లు, నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఇతర కళాకారులంతా ఒక కుటుంబంలా ముందుకొచ్చి రామచంద్రకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన చికిత్సకు మరింత సహాయం అందించే దిశగా ఈ విషయాన్ని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు గారి దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.దశరథ చూపిన మానవత్వానికి రామచంద్ర కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన చేస్తున్న సేవలను అభినందించారు. అలాగే నటుడి గా దశరథ వెండితెర ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, అక్టోబర్ 30న విడుదల కానున్న ‘కిల్లర్’ సినిమా ఘనవిజయం సాధించా లని మనస్ఫూర్తిగా శుభా కాంక్షలు తెలిపారు. ప్రస్తు తం ‘కిల్లర్’ సినిమాలో నటిస్తూ, లైన్ ప్రొడ్యూసర్ గా బాధ్యతలు నిర్వహిస్తు న్న దశరథ, మరోవైపు TV5 డిజిటల్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేటివ్ హెడ్‌గా కొనసాగుతున్నారు.

# థ్రిల్లింగ్ మూవీ "కిల్లర్"

**వుదయం సినిమా:** జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ "కిల్లర్". ఈ చిత్రంలో మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, అయినాబత్తిన దశరథ మాధవ్, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. "కిల్లర్" సినిమా ఈ నెల 30న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. ఓవర్సీస్ లో "కిల్లర్" మూవీని ఓఎంజి పిక్చర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు డైరెక్టర్, ప్రొడ్యూసర్, యాక్టర్ పూర్వాజ్ – "కిల్లర్" రిచ్ కంటెంట్ ఉన్న సినిమా. సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. యు సర్టిఫికెట్ ఇచ్చారు. సినిమా చూశాక సెన్సార్ వాళ్ల మొహాలు ఆహ్లాదకరంగా కనిపించాయి. అంటే మా మూవీ వారికి నచ్చిందని అనుకున్నాం. మా సినిమాలో బ్లడ్ షెడ్ లేదు. రక్తం చూస్తే నాకే కళ్లు తిరుగుతాయి. కథలో హింస ఉన్నా, అది పాత్రలు ఎదుర్కొనే దాంట్లో కనిపించాలి గానీ పాత్రలను చిత్రహింసలు పెట్టినట్లు చూపించడం నాకు నచ్చదు. వాంపైర్ పాత్రను కూడా అలాగే అందరు చూసేలా ట్రీట్ చేశాం. మూవీలో టెర్రరిస్ట్ పాత్ర పది నిమిషాలు కనిపిస్తుంది మళ్లీ కనిపించదు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.